JAYABHERIDAILY.COM

ప్రభాత

# జయభేరి

జాతీయ తెలుగు దినపత్రిక

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

మేడ్చల్ - మల్కాజిగిరి । ఆదివారం 22-02-2026

Medchal - Malkajgiri । Suǝday 22-02-2026

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

Follow: jayabherinews

సంపుటి : 02 । సంచిక : 267

పేజీలు : 8 । వెల : 5

Vol. 02 । Issue 267 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?

సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?

మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!

ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..

డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...

"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889

call me

jayabheripaper@gmail.com





## ఢిల్లీలో హై అలర్ట్.. భద్రత కట్టుదిట్టం

■ దాడులకు లష్కరే తొయిబా ప్లానింగ్

- జయభేరి, న్యూ ఢిల్లీ ఫిబ్రవరి 21 :

దేశ రాజధాని ఢిల్లీలో అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. అలాగే ప్రధాన దేవాలయాల్లోనూ అలర్ట్ కొనసాగుతోంది. దీనిలో భాగంగా అనేక చోట్ల భద్రతను కట్టుదిట్టం చేశారు. దేశ రాజధాని ఢిల్లీతో పాటు పలు దేవాలయాలపై పాకిస్తాన్‌కు చెందిన లష్కరే తొయిబా అనే తీవ్రవాద సంస్థ దాడులకు కుట్ర పన్నిందని ఇంటెలిజెన్స్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఢిల్లీతోపాటు ప్రముఖ నగరాలు, ప్రధాన దేవాలయాలు వంటి రద్దీ ప్రదేశాల్ని లష్కరే తొయిబా సంస్థ టార్గెట్ చేసుకున్నట్లు నిఘా వర్గాల సమాచారం. ముఖ్యంగా ఢిల్లీలోని చారిత్రక ప్రదేశాలైన ఎర్రకోట, చాందినీ చౌక్, పరిసర దేవాలయాల్లో ఐఈడీలతో పేలుడుకు కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. దీంతో అప్రమత్తమైన అధికారులు భద్రతను మరింత పెంచి హై అలర్ట్ ప్రకటించారు.

2 లో



## క్రియేటర్లు సామాజిక బాధ్యతగా ముందుకు రావాలి

■ సైబర్ నేరాలను సమర్ధవంతంగా అరికట్టేందుకు హైదరాబాద్ సిటీ పోలీసులు సరికొత్త వ్యూహం

■ జాగృత్ హైదరాబాద్ - సురక్షిత్ హైదరాబాద్' క్యాంపెయిన్‌లో నగర సిపి సజ్జనార్ పిలుపు

- జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 21 :

సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టేందుకు హైదరాబాద్ సిటీ పోలీసులు సరికొత్త వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు. కేవలం అధికారిక హెచ్చరికలకే పరిమితం కాకుండా, సామాన్యులకు సైతం సులువుగా అర్ధమయ్యే రీతిలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్, ఐపిఎస్ ఆధ్వర్యంలో విజయవంతంగా కొనసాగుతున్న 'జాగృత్ హైదరాబాద్ సురక్షిత్ హైదరాబాద్'

2 లో

## గ్రామ పంచాయితీలకు సీఎం గుడ్ న్యూస్

■ పరిసరాల శుభ్రత.. మన బాధ్యత

■ ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీ

■ రాష్ట్రంలో పెను మార్పులు రాబోతున్నాయి

■ పీ4తో పేదలకు ఆర్థిక చేయూత

■ ఢిల్లీలో ఏఐ సదస్సు సమయంలో కాంగ్రెస్ ప్రవర్తన దారుణం


■ స్వాళ్ల సందర్శన... ఉత్పత్తుల పరిశీలన



2 లో

జయభేరి, విజయవాడ, ఫిబ్రవరి 21 :

పేద ప్రజల ఆదాయాన్ని పెంచి వారి జీవితాల్లో ఆనందాన్ని నింపుతామని... ప్రతి ఒక్కరికి ఆనందం పంచేలా కృషి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజలకు ఆదాయం పెంచే మార్గాన్ని నేర్పించి వారిని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా వినుకొండలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర సాధ్యమని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. పల్నాడులో అడుగుపెడితే వచ్చే వైబ్రేషన్ వేరు వినుకొండలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "పౌరుషాల గడ్డ పల్నాడులో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నాం. పల్నాడులో అడుగుపెడితే వచ్చే వైబ్రేషనే వేరుగా ఉంటుంది. ఇటీవల కోటప్పకొండలో శివరాత్రి ఉత్సాహంగా జరిగింది. భక్తులతో దద్దరిల్లింది. కోటప్పకొండ తిరునాళ్లు ఘనంగా నిర్వహించారు. శివరాత్రి ప్రభలు అంటే కోటప్పకొండ ప్రభలే గుర్తుకు వస్తాయి. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా బాగా జరుగుతున్నాయి. నేను గతంలో ముఖ్యమంత్రిగా పచ్చదనంపరిశుభ్రత, నీరు మీరు, ఆకస్మిక తనిఖీలు వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టాను.



వికారాబాద్ లో ఉభయ తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరై దిశా నిర్దేశం చేశారు. డీసీసీ అధ్యక్షులు అందరినీ సమన్వయం చేసుకుని, పార్టీ బలోపేతం కోసం పని చేయాలి. నెహ్రూ నుండి సోనియా గాంధీ వరకు కాంగ్రెస్ ప్రస్థానం త్యాగాల చరిత్ర. కాంగ్రెస్ తెచ్చిన స్వాతంత్ర్యం, ఇచ్చిన రాజ్యాంగం వల్ల పుట్టిన పార్టీలు కాంగ్రెస్ ముక్త భారత్ అని మాట్లాడుతున్నాయి. రాజ్యాంగాన్ని రద్దు చేయాలని, సమూలంగా మార్చాలని కుట్రలు పన్నుతున్నాయి. కాంగ్రెస్ కార్యకర్తల నుండి అగ్రనేతల వరకు కలిసి కట్టుగా పని చేసి, ఈ కుట్రలను ఛేదించాలి. ఈ దేశ ప్రజల గుండె చప్పుడు కాంగ్రెస్. వారి హక్కులను కాపాడే శక్తి కాంగ్రెస్. డీసీసీ అధ్యక్షులు జిల్లాలకు తాము అధిపతులం అని భావించవద్దు. విభేదించే వారిని కూడా కలుపుకుని పని చేయాలి.

## డీసీసీ అధ్యక్షులకు శిక్షణ


జయభేరి, వికారాబాద్, ఫిబ్రవరి 20 :

తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ను సంస్థాగతంగా బలోపేతం చేసేందుకుగాను జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ)ల అధ్యక్షులకు శిక్షణ తరగతులు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని అనంతగిరి హరిత రిసార్ట్స్‌లో శనివారం ప్రారంభమయ్యే ఈ శిక్షణ తరగతులు మార్చి 2 వరకు కొనసాగనున్నాయి. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ అధిష్ఠానం నిర్వహిస్తున్న ఈ తరగతులకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 77 మంది

...మిగతాది 2 లో

## దేశంలో నక్సలిజం అంతం

■ మంత్రి అమిత్ షా



2 లో

జయభేరి, గౌహతి, ఫిబ్రవరి 21:

మార్చి 31 లోగా దేశం నుంచి నక్సలిజాన్ని నిర్మూలించనున్నట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. 87వ సీఆర్పీఎఫ్ డే పరేడ్‌లో ఆయన పాల్గొన్నారు. జమ్మూకశ్మీర్‌లో సీఆర్పీఎఫ్ దళాలు కీలక పాత్ర పోషించినట్లు ఆయన చెప్పారు. అక్కడ రాళ్లు రువ్వే ఘటనలు సున్నాకు పడిపోయినట్లు వెల్లడించారు. మణిపూర్‌లోనూ వర్గ హింసను ఆ దళాలు కట్టడి చేసినట్లు చెప్పారు. కేవలం మూడేళ్లలో మావోయిస్టుల వెన్ను విరిచినట్లు సీఆర్పీఎఫ్‌ను మంత్రి షా కీర్తించారు.

## హిట్ అండ్ రన్ రాజకీయాల్లో ప్రతిపక్ష పార్టీలు

2 లో



## కుదిరిన కీలక వాణిజ్య ఒప్పందం

■ భారత్-బ్రెజిల్ సంబంధాలలో కొత్త అధ్యాయం

జయభేరి, న్యూఢిల్లీ:

భారతదేశంబ్రెజిల్ సంబంధాలలో కొత్త అధ్యాయం మొదలైంది. భారత్ – బ్రెజిల్ మధ్య కీలక వాణిజ్య ఒప్పందం కుదిరింది. రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలకు కొత్త ఊపునిచ్చే కీలక అంశాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డసిల్వా మధ్య ద్వైపాక్షిక చర్చలు ఏకాభిప్రాయానికి వచ్చాయి. అధ్యక్షుడు లూలా, ఆయన ప్రతినిధి బృందాన్ని భారతదేశానికి స్వాగతిస్తూ, ప్రధానమంత్రి మోదీ మాట్లాడుతూ, “అధ్యక్షులు లూలా, ఆయన బృందాన్ని భారతదేశానికి స్వాగతించడానికి సంతోషిస్తున్నాను. భారత్‌బ్రెజిల్ సంబంధాలు చాలా కాలంగా ఆయన దార్శనికత, స్ఫూర్తిదాయక నాయకత్వం ద్వారా ప్రయోజనం పొందాయి” అని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇద్దరు నాయకులు అనేకసార్లు సమావేశమయ్యారు. ప్రతిసారీ బ్రెజిల్ అధ్యక్షులు లూలాకు భారతదేశం పట్ల ఉన్న లోతైన స్నేహం, నమ్మకం స్పష్టంగా అనుభూతి చెందిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

...మిగతాది 2 లో



## జీవన రెడ్డి దారెటు

జయభేరి, కరీంనగర్, ఫిబ్రవరి 21 :

జగిత్యాల కాంగ్రెస్‌లో సీనియర్ నేత టి.జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మధ్య నడుస్తున్న ఆధిపత్య పోరు ఇప్పుడు కేవలం నియోజకవర్గానికే పరిమితం కావట్లేదు. రాష్ట్ర రాజకీయాల్లో ఒక సంచలనంగా మారింది. దశాబ్దాలుగా కాంగ్రెస్ జెండాను మోస్తూ, పార్టీ కష్టకాలంలోనూ అండగా నిలిచిన ఒక సీనియర్ నేత.. నేడు సొంత పార్టీలోనే 'మనుగడ' కోసం పోరాడాల్సి రావడం తీవ్ర చర్చకు దారితీస్తోంది.తెలంగాణ రాజకీయాల్లో 'క్లీన్ ఇమేజ్' ఉన్న అతికొద్ది మంది నేతల్లో జీవన్ రెడ్డి ఒకరు. కానీ, ప్రస్తుతం ఆయన ఎదుర్కొంటున్న పరిస్థితులు ఒక విధమైన రాజకీయ సంక్షోభాన్ని తలపిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ, కేడర్ గొంతుకగా నిలిచిన ఆయనకు.. తన ప్రత్యర్థిగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లోకి రావడమే పెద్ద దెబ్బగా మారింది.గత ఎన్నికల్లో సంజయ్ కుమార్ చేతిలో జీవన్ రెడ్డి ఓడిపోయారు. అయితే, రాజకీయ సమీకరణాల్లో భాగంగా సంజయ్ కుమార్‌ను పార్టీలోకి చేర్చుకోవడం జీవన్ రెడ్డి వర్గానికి మింగుడుపడలేదు. అప్పటి నుండి నియోజకవర్గంలో ప్రోటోకాల్ విషయంలోనూ, అభివృద్ధి పనుల విషయంలోనూ ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే వాతావరణం నెలకొంది. పార్టీ కోసం దశాబ్దాలుగా జెండాలు మోసిన కార్యకర్తలను కాదని, నిన్నగాక మొన్న వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తుంటే ఇక మా ఉనికి ఎక్కడ? అనే ప్రశ్న జీవన్ రెడ్డి మద్దతుదారుల నుండి బలంగా వినిపిస్తోంది.ఇటీవల జరిగిన

...మిగతాది 2 లో

# అంగరంగ వైభవంగా సాగుతున్న శ్రీలక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు

- ఉత్సవాల్లో భాగంగా నేడు ఉదయం శ్రీకృష్ణాలంకారం, రాత్రి పొన్నవాహన సేవ

**జయభేరి, యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 21:**



సర్వం తానై ధర్మరక్షణకు శ్రీలక్ష్మీ నారసింహుడు అలంకార సేవలతో భక్తకోటికి దర్శనమిస్తున్నాడు. తెలంగాణ ప్రసిద్ధి క్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం వటపత్రశాయి అలంకారంలో స్వామి వారు భక్తులకు దర్శనమివ్వగా సాయంత్రం హంసవాహనంపై భక్తులను సాక్షాత్కరించారు. శ్రీ పాంచరాత్రాగమ శాస్త్రానుసారముగా ఆలయ ప్రధానార్చకులు, ఉపప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, వేదపండితులు,అర్చక బృందం,పారాయణీకులు స్వామి వారిని వటపత్ర సాయి అలంకారంలో అలంకరించి ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆస్థాన మండపంలో వేంచింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో నిత్యారాధనల అనంతరం స్వామివారిని హంసవాహనంపై ఆలయ తిరువీధుల్లో ఊరేగిస్తూ భక్తులను అనుగ్రహించగా భక్తులు దర్శించుకొని తరించారు. ఈ సందర్భంగా వటపత్రశాయి అలంకారం, హంసవాహన సేవ అవతార విశిష్టతను ఆలయ అర్చకులు భక్తులకు వివరించారు. పూజా వేడుకల్లో ఐఏఎస్ అధికారి నరసింహా రెడ్డి, సమాచార శాఖ కమీషనర్ దేశాల్ భూపాల్,యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహ్మమూర్తి, యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్, ప్రధానార్చకులు కాదూరి వెంకటాచార్యులు, సురేంద్రాచార్యులు, ఉప ప్రధానార్చకులు నర్సింహ్మమూర్తి, మాధవాచార్యులు, మణికంఠ శ్రీధర్, లక్ష్మణాచార్యులు, వేదపండితులు శ్రీనివాసశర్మ, శ్రీవాస్తవ శర్మ,అర్చకులు కిరణాచార్యులు, శ్రీనివాసాచార్యులు, ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్‌శర్మ, యాదగిరిగుట్ట మున్సిపల్ ఛైర్మన్ గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్, ఆలయ అధికారులు రఘు, రాజన్ బాబు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



### వటపత్ర శాయి అలంకార సేవ..

అన్ని లోకాలు జలాలతో నిండి ఉండగా ఆ జలాలపై ఓ మఱి ఆకుపై భగవానుడు పవళించి తన లీలా విలాసాన్ని చూపించాడని అర్చకులు వివరించారు. తన కడుపులోని 14 లోకములకు,సమస్త ప్రాణములకు,ప్రకృతికి భగవానుడు అమృతమును అందించి వాటిని సంరక్షించిన తీరు ఈ వటపత్ర శాయి అలంకారంలో దర్శించవచ్చని అర్చకులు తెలిపారు.

### హంసవాహన సేవ..

భగవానుడి అనేక అవతారాలలో హంసావతారం ఎంతో ప్రసిద్ధి చెందిందని అర్చకులు తెలిపారు. హంస జ్ఞానానికి ప్రతీక అని, బ్రహ్మదేవుడికి వేదములను ఉపదేశం చేసి భగవానుడు తన దివ్య అనుగ్రహాన్ని హంస రూపంలో సాక్షాత్కరించిన తీరు ఈ అవతారంలో ఎంతో ప్రత్యేకత అని వివరించారు.

### అలరించిన ధార్మిక, సంగీత మహాసభలు..

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ధార్మిక, సంగీత మహాసభలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. యాదగిరిగుట్టకు చెందిన శ్రీవైష్ణవ సేవా సమాఖ్య వారిచే విష్ణుసహస్రనామ పారాయణం,శ్రీవేంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ వారిచే కోలాటం,నృత్యం నిర్వహించారు. భజన, మంగళ వాయిద్యం, వైదిక ప్రార్ధన, హరికథ, కూచిపూడి, వయోలిన్, భరతనాట్య ప్రదర్శనలు భక్తులకు ఎంతో అలరించాయి.

### ఉచిత వైద్యశిబిరం..

శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కొండపైన ప్రధాన కార్యాలయం ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు,స్థానికులు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### బ్రహ్మోత్సవాల్లో నేడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు ఉదయం 9 గంటలకు శ్రీకృష్ణాలంకారం మురళీ కృష్ణుడులో, రాత్రి పొన్నవాహన సేవలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.


# ఏం చేసుకుంటారో చేసుకోండి

- పెండింగ్ కోర్టు కేసులు దాచిపెట్టి ప్లాట్ల విక్రయం
- 4.5 సంవత్సరాలుగా ఇబ్బందులు
- జైహింద్ గౌడ్ & VRR రాజీ రెడ్డి పై ఎందుకు చర్యలు లేవు?

**జయభేరి, మేడ్చల్ :**


రాంపల్లి గ్రామం, కీసర మండలం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని లే అవుట్ సర్వే నం. 268లో వందకు పైగా ప్లాట్ యజమానులు గత 4.5 సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాధితుల ప్రకారం, 2019లో తమ కష్టార్జిత సొమ్ముతో ఉప్పల్‌కు చెందిన పంజాల జైహింద్ గౌడ్, నాచారానికి చెందిన బండారి శంకర్ గౌడ్, బానోతు సాయి కుమార్, బోడుప్పల్‌కు చెందిన సింగారం రవి కుమార్ ల వద్ద ప్లాట్లు కొనుగోలు చేశారు. అయితే, ఆ భూమికి సంబంధించిన పెండింగ్ కోర్టు కేసులను ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టి విక్రయాలు నిర్వహించారని వారు ఆరోపిస్తున్నారు.

పెండింగ్ లిటిగేషన్లు ఉన్న విషయం వెల్లడించకుండా ప్లాట్లు అమ్మడం ఒక స్పష్టమైన క్రిమినల్ మోసం అని బాధితులు పేర్కొన్నారు. ఇదే సమయంలో, VRR కన్స్ట్రక్షన్స్ అధినేత వంగేటి రాజీ రెడ్డి (VRR Raji Reddy), అతని అనుచరులు నకిలీ పత్రాలతో ప్లాట్లపై అక్రమ కబ్జాకు ప్రయత్నిస్తూ, గత 4.5 సంవత్సరాలుగా యజమానులను బెదిరింపులకు గురిచేస్తున్నారని బాధితులు తెలిపారు. ప్లాట్ల వద్దకు వెళ్లినప్పుడు కిరాయి వ్యక్తులను పంపించి భయభ్రాంతులకు గురిచేస్తూ "ఏం చేసుకుంటారో చేసుకోండి" అని సవాల్ చేస్తున్నారని వారు వాపోయారు.



**FIRST INFORMATION REPORT**
(Under section 173 and 176 BNSS)
T.S.P.M. Orders 470,500

District Rachakonda P.S. Keesara Year 2026 FIR No. 37/2026 Date 14-01-2026
Acts & Section(s): 406,420,r/w 34 IPC
a) Occurrence of Offence: Day Sunday Date & Time From
Date & Time To Prior To 30-06-2024 10:22:14 Time Period
b) Information Received at P.S.: Date & Time 14-01-2026 10:30:00
General Diary Reference: Entry No 11 Date & Time 14-01-2026 10:30:00
Type of Information: Written
Place of Occurrence:
a) Distance and Direction From P.S.: 10, South Beat No. 5
b) Address Place SY NO 268 Rampally Area/Mandal Keesara Street/Village Rampally
City/District MEDCHAL MALKAJGIRI State Telangana PIN
c) In case, outside the limit of this Police Station, then
Name of P.S. District



**FIRST INFORMATION REPORT**
(Under section 173 and 176 BNSS)
T.S.P.M. Orders 470,500

District Malkajgiri P.S. Pocharam IT Corridor Year 2026 FIR No. 99/2026 Date 20-02-2026
Acts & Section(s): 316(2),318(4),351(2),r/w 61(2) BNS
a) Occurrence of Offence: Day Friday Date & Time From
Date & Time To Prior To 20-02-2026 00:00:00 Time Period
b) Information Received at P.S.: Date & Time 20-02-2026 21:00:00
General Diary Reference: Entry No 21 Date & Time 20-02-2026 21:00:00
Type of Information: Written
Place of Occurrence:
a) Distance and Direction From P.S.: 02, South Beat No.
b) Address Place Sy. No: 268, Keesara Area/Mandal Pocharam IT COrridor Street/Village YAMNAMPET VILLAGE
City/District MEDCHAL MALKAJGIRI State Telangana PIN
c) In case, outside the limit of this Police Station, then
Name of P.S. District
Complainant / Informant:
a) Name M. Yadadgiri
b) Father's /Husband's Name
c) Date/Year of Birth Age Years
d) Nationality India e) Caste

ఆర్థికంగా కుంగిపోయిన ప్లాట్ యజమానులు.. బాధితుల్లో ఎక్కువ మంది మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారు. జీవితకాల పొదుపులు పెట్టారు.. కొందరు రుణాలు తీసుకుని ప్లాట్లు కొనుగోలు చేశారు. గత 4.5 సంవత్సరాలుగా ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నారు. మానసిక ఒత్తిడి, కుటుంబ సమస్యలు ఎదుర్కొంటున్నారు. అయినా ఇప్పటివరకు పూర్తి న్యాయం జరగకపోవడం బాధాకరం అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రభుత్వానికి బహిరంగ విజ్ఞప్తి

మేము వందకు పైగా మధ్యతరగతి కుటుంబాలము. మా జీవితకాల సంపాదనను పెట్టి కొనుగోలు చేసిన ఆస్తులపై అక్రమ కబ్జా ప్రయత్నాలు జరుగుతున్నాయి. పంజాల జైహింద్ గౌడ్, బండారి శంకర్ గౌడ్, బానోతు సాయి కుమార్, సింగారం రవి కుమార్, VRR రాజీ రెడ్డి పై తక్షణ, కఠిన, పారదర్శక చర్యలు తీసుకోవాలని మేము ప్రభుత్వాన్ని, పోలీసు శాఖను డిమాండ్ చేస్తున్నాము.

### బాధితుల ప్రశ్నలు

పెండింగ్ కోర్టు కేసులను దాచిపెట్టి విక్రయాలు నిర్వహించిన వారిపై ఎందుకు కఠిన చర్యలు తీసుకోవడం లేదు? జైహింద్ గౌడ్, ఇతర విక్రేతలపై నమోదైన ఆరోపణలపై దర్యాప్తు ఎక్కడ ఉంది? VRR రాజీ రెడ్డి, అతని గ్యాంగ్‌పై పలు స్టేషన్లలో కేసులు నమోదైనప్పటికీ ఎందుకు అరెస్టులు జరగడం లేదు? 4.5 సంవత్సరాలుగా బాధితులు ఇబ్బందులు పడుతుంటే బాధ్యత ఎవరిది? తెలంగాణ హైకోర్టు ఆదేశాలను ఆధారంగా చేసుకుని.. FIR No. 99/2026 - P.S. Pocharam IT Corridor, FIR No. 37/2026 - P.S. Keesara (14012026) నమోదు చేయబడినట్లు బాధితులు తెలిపారు.



# నూతనంగా ఎన్నుకోబడిన కౌన్సిలర్ కు ఘన సన్మానం

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ లో నూతనంగా ఎన్నుకోబడిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు ల ను గరుడాద్రి వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ ఘనంగా సన్మానించినారు. సన్మానంలో భాగంగా ఐదో వార్డు నూతనంగా ఎన్నుకోబడిన కౌన్సిలర్ నేనావత్ శ్రీ కన్య సేవియా నాయక్ ల ను ఆలయ కమిటీ అధ్యక్షులు మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, కార్యదర్శి దొడ్డి అశోక్, కోశాధికారి శిరందాసు కృష్ణయ్య వీరిని ఘనంగా సన్మానించినారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్, నూతన కౌన్సిలర్లు, పానుగంటి మల్లయ్య, నీల పాండురయ్య, వాస వెంకటేశ్వర్లు, నీల బుచ్చయ్య, కర్నాటి పురుషోత్తం, సముద్రాల ధనంజయ, దొడ్డి సుధాకర్, వాస నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



**జయభేరి, దేవరకొండ :**

మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వ), దేవరకొండ లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలుగు విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమావత్ రవి మాట్లాడుతూ మాతృభాషల ఉనికిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత మనందరిపైన ఉందని, మన సంస్కృతి, సంప్రదాయాలు మాతృభాషతో పెరవేసుకుని ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి జి.కోటయ్య, అధ్యాపకులు అద్దంకి శ్రీను, పొలిటికల్ సైన్స్ విభాగం అధ్యాపకులు కె.నాగరాజు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు లారీలను నడపడం నిలుపువేయ్యాలి

- సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి డిమాండ్

**జయభేరి, పరవాడ:**



పరవాడ మండల పరిషత్ కార్యాలయం జంక్షన్ లో హిందూజా బొగ్గు లారీలను ఈ మార్గం మీదగా నడపడం నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గని శెట్టి మాట్లాడుతూ హిందూజా బొగ్గు లారీలను ఈ మార్గం మీదగా ప్రయాణించడం వలన తీవ్రమైన బొగ్గు ఈ రోడ్లపై పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, లారీలు నిండు ధూళి రోడ్లపై ప్రజలు ఈ మార్గంలో ప్రయాణించడమే నరకంగా భావిస్తున్నారు అన్నారు. పరవాడ ఎమ్మార్వో ఆఫీస్ జంక్షన్, సినిమా హాల్ జంక్షన్, సబ్ స్టేషన్, లంకెలపాలెం గ్రామం పూర్తిగా ధూళితో మూసివేయబడింది అన్నారు. ఈ గ్రామాల్లో ప్రజలు ఉండలేని పరిస్థితి ఏర్పడుతుందని గని శెట్టి ఆవేదన వ్యక్తం చేశారు. అధిక లోడుతో ప్రయాణిస్తున్న లారీలపై ఆర్టీవో అధికారులు దాడులు చేసికేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మార్గంలో అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, రోడ్లు పూర్తిగా పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి అన్నారు. హిందూజా కి రైల్వే ద్వారా బొగ్గు తరలించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల్ని రకంగా కాలుష్యానికి నెట్టు వేయడం అన్యాయం అన్నారు. వెంటనే బొగ్గు దూళి లారీలపై చర్యలు చేపట్టాలని గని శెట్టి డిమాండ్ చేశారు. హిందూజా కంపెనీ బొగ్గు లారీలకు బదులుగా రైల్వే మార్గం ద్వారా బొగ్గు తరలించుకోవాలి తప్ప ఈ మార్గంలో ప్రయాణించడం వలన ప్రజల తీవ్ర అనారోగ్యాలు జబ్బులకు గురవుతున్నారని అన్నారు. వెంటనే ఈ మార్గం నుండి బొగ్గు లారీలు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం హిందూజా కంపెనీకి అండగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వ పెద్దల సహకారంతో ప్రజల్ని కాలుష్యంలో హిందూజా యాజమాన్యం నెట్టి వేస్తుందని ప్రభుత్వాలు కళ్ళు అప్పగించుకొని చూస్తున్నాయని గని శెట్టి అన్నారు. ఈ కార్యక్రమంలో అప్పికొండ నాగరాజ్, శ్రీనివాసరావు, రాజు, సత్యనారాయణ, అప్పల నరసమ్మ, చిన్న, ఫాతిమా బేగం, తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలి

- విద్యుత్ అధికారులతో సమావేశంలో యాదగిరిగుట్ట మున్సిపల్ ఛైర్మన్ గుండ్లపల్లి వాణి-భరత్ గౌడ్

**జయభేరి, యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 21 :**

యాదగిరిగుట్ట పట్టణంలో విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని యాదగిరిగుట్ట మున్సిపల్ ఛైర్మన్ గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్ కోరారు. శనివారం యాదగిరిగుట్ట పట్టణంలోని 10వ వార్డులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన అనంతరం మున్సిపల్ కార్యాలయంలో విద్యుత్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట పట్టణంలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై అధికారులకు వివరించారు. విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని కోరగా త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని విద్యుత్ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో యాదగిరిగుట్ట మున్సిపల్ కమిషనర్ లింగస్వామి, మున్సిపల్ వైస్ చైర్మన్ బరిగే రమ్య రామచందర్, మున్సిపల్ కౌన్సిలర్లు బోడ రాధ,బూడిద మధు,కాటబత్తిని స్వప్న,బిట్టు సరోజ,కర్రె మాధవి,పెలిమెల్లి లావణ్య,పేరబోయిన సత్యనారాయణ,సాదునేని ధనలక్ష్మి,ముక్కెర్ల మల్లేష్, బబ్బురి శ్రీధర్,అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ పోక్సో కేసుల్లో నిందితులకు కౌన్సెలింగ్



**జయభేరి, పరవాడ:**

పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో పూర్వం పోక్సో కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులను ఈరోజు పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వారి ప్రస్తుత పరిస్థితులు,నివాస వివరాలు, కార్యకలాపాలు తదితర అంశాలపై సమగ్రంగా వివరాలు సేకరించి పరవాడ సీఐ ఆర్. మల్లికార్జున రావు పర్యవేక్షణలో నిందితులకు కౌన్సెలింగ్ నిర్వహించారు వారి ప్రస్తుత ప్రవర్తన, కదలికలు మరియు సామాజిక పరిస్థితులను విశ్లేషించి, భవిష్యత్తులో మళ్లీ నేరాలకు పాల్పడే అవకాశాలు ఉన్నవారిని గుర్తించి అలాంటి వ్యక్తులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించబడుతుందని చిన్నారుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ముందస్తు జాగ్రత్త చర్యల భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు పరవాడ పోలీసులు తెలిపారు.

# మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు

- వైస్సార్సీపీ నాయకులు




**జయభేరి, పరవాడ:**

పెందుర్తి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ పుట్టినరోజు సందర్భంగా శనివారం రాంపురం లో గల మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో పరవాడ వైస్సార్సీపీ నాయుకులు మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజును కలిసి శాలువాతో సత్కారించి పూలమొక్క ఇచ్చి శుభాకాంక్షలు తెలియచేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ కార్యదర్శి మరియు మాడుగుల, పాయకరావుపేట నియోజకవర్గాల వైసీపీ పరిశీలకుడు పైలా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు పైలా సన్యాసిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మాజీ వైస్సార్సీపీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు, దళాయి నదియా, పైలా సాయి అప్పలనాయుడు,కావలి వాసు, ఎక్స్ ఎంపీటీసీ కావలి రాజు మరియు మండలం లో గల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను సన్మానించిన వర్తక సంఘం సభ్యులు




**జయభేరి, పరవాడ:**

బొగ్గు, ఫ్లై యాష్ కాలుష్యంతో నిత్యం లంకెలపాలెం లోని వర్తకులు,ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రస్తుతం జరుగుతున్న శాసన సభ అసెంబ్లీ సమావేశంలో సమస్య గురించి ప్రస్తావించి ప్రభుత్వం దృష్టిలో పెట్టినందుకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును లంకెలపాలెం మరిడిమాంబ చిల్లర వర్తక సంగం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ తమ బాధలను ఎవరూ పట్టించుకోలేదని, అసెంబ్లీలో ప్రస్తావించడమే కాకుండా స్వయంగా లంకెలపాలెం జంక్షన్ లో వర్తకులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకోవడానికి లంకెలపాలెం జంక్షన్ కు ఎమ్మెల్యే పంచకర్ల రావడం పై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పంచకర్ల రమేష్ బాబు ఆర్ అండ్ బి అధికారులు మరియు ఫార్మా యాజమాన్యాలతో లంకెలపాలెం జంక్షన్ అంతా పర్యటించి, రెండు మూడు రోజుల్లో మరమ్మత్తులు చేపట్టాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో 79వా వార్డ్ కార్పొరేటర్ రాతు శ్రీనివాసరావు,నాయుకులు,వర్తక సంఘ సభ్యులు సుందవరపు శ్రీనివాస్, మంత్రిగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించినందుకు కృతజ్ఞతలు

■ జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ యువజన అధ్యక్షులుగా రెడ్డి కోటేశ్వరరావు నియామకం

జయభేరి, దేవరకొండ :

దేవరకొండ పట్టణం రాంనగర్ 16వ వార్డుకు చెందిన రెడ్డి కోటేశ్వరరావు నియోజకవర్గ యువజన అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. నియామక ఉత్తర్వులు సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. పదవీకాలం రెండు సంవత్సరాలకు గాను కొనసాగుతుందని తెలియజేశారు. ఈ సందర్బంగా రెడ్డి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు, నియోజకవర్గంలో గ్రామస్థాయి నుంచి మండల స్థాయి, నియోజకవర్గస్థాయి కమిటీలను నియామకం చేసి సంఘం యొక్క బలోపేతానికి, ఐక్యత కోసం , స్థానిక సంస్థల రిజర్వేషన్ కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. నా ఎన్నికకు సహకరించిన డాక్టర్ చోల్లేటి భాస్కరాచారి, వరికుప్పల శ్రీను ఆర్మీ, పెరికేటి శ్రీనివాస్ చారి, భీమగోని శివగౌడ్, పున్న వెంకటేష్ నేత, పున్న బిక్షమయ్యలకు సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేసినారు.

## కాకతీయ మాడల్ హైస్కూల్ లో మాక్ అసెంబ్లీ



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం చౌదర్పల్లి స్టేజ్ సమీపంలోని కాకతీయ మోడల్ హైస్కూల్లో శనివారం మార్క్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రొటెం స్పీకర్ గా బుష్రా, స్పీకర్ గా శ్రీజ, ముఖ్యమంత్రిగా జ్ఞానేశ్వర్, గ్రామీణ అభివృద్ధిశాఖ మంత్రిగా నితిన్, సమాచార,సాంకేతిక శాఖ మంత్రిగా మృణాళిని,మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రిగా అభీష్ట, క్రీడామంత్రిగా నందిని, వ్యవసాయ శాఖ మంత్రిగా బుష్రా, రవాణా శాఖ మంత్రిగా పల్లవి, ఆర్థిక శాఖ మంత్రిగా శ్రేష్ట, ఇతర విద్యార్థులు అధికార మరియు ప్రతిపక్ష ఎమ్మెల్యేలుగా పాల్గొన్నారు. కాకతీయ పాఠశాల కరస్పాండెంట్ గౌని రాయి రెడ్డి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావి పౌరులుగా మారనున్న తరుణంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగంపై అవగాహనతో సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా నడుచుకుంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎలియాస్ కోలా, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని కలిసిన దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్

■ మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాలపై చర్చ
■ ఎమ్మెల్యే జిఎంఆర్ ను అభినందించిన ముఖ్యమంత్రి



జయభేరి, దేవరకద్ర :

హైదరాబాద్ లో శనివారం ముఖ్యమంత్రి నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేవరకద్ర నియోజకవర్గం లోని మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై ఎమ్మెల్యే జీఎంఆర్ తో ముఖ్యమంత్రి చర్చించారు. మూడు మున్సిపాలిటీలలో కూడా భారీ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఎమ్మెల్యేకు ముఖ్యమంత్రి సూచించారు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే జిఎంఆర్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి స్వామి వారినీ దర్శించుకున్న BRS నాయకులు వడ్త్యా రమేష్ నాయక్

జయభేరి, గుండ్లపల్లి :

గుండ్లపల్లి మండలం (డిండి) మండలం దాసరి నెమలి పూర్ లో కొలువైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి జాతర సందర్భంగా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించిన BRS దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్యా రమేష్ నాయక్, కమిటీ సభ్యులు BRS దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్యా రమేష్ నాయక్ నీ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ దాసరి నెమలి పూర్ సర్పంచ్ రఫియా భాసీర్ ఉప సర్పంచ్ రాంరెడ్డి, నరేందర్ రెడ్డి, భగవత్, శ్రీను,పెద్ద తండ మాజీ కాట్రావత్ వెంకటేష్, బాలాజీ నాయక్,పుల్ సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# హిందూజా ఎన్టీపీసీ యాజమాన్యాలు రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలి

■ దెబ్బతిన్న రహదారిని అధికారులుతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే పంచకర్ల

జయభేరి, పరవాడ:



పెందుర్తి నియోజకవర్గం పరవాడ మండలం జీవీఎంసీ 79 వ వార్డు లంకెలపాలెం ఫ్లైఓవర్ పై ప్రతిరోజు వందలాది ఫ్లై యాష్ మరియు బొగ్గు లారీల రవాణా వలన విపరీతంగా గోతులమైన లంకెలపాలెం జంక్షన్ లోని రోడ్లను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు శనివారం పరిశీలించారు. లంకెలపాలెం పాత ఊరిలోని దుర్గాలమ్మ గుడి వద్ద నుండి లంకెలపాలెం జంక్షన్ వరకు కాలినడకన ఆయన ప్రతీ గొయ్యిని పరిశీలించారు. ఈ సందర్భంగా బొగ్గు లారీల రవాణా వలన రోడ్ల పక్కన పడి ఉన్న బొగ్గు పొడి మరియు ఫ్లైయాష్ ను కూడా తనిఖీ చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు కెపాసిటీ కంటే అధికలోడుతో ప్రతిరోజు వందలాది లారీలు ఈ రోడ్డు గుండా ప్రయాణం చేయడం వలన ఈ రోడ్లన్నీ గోతులమైపోయాయని ముఖ్యంగా హిందుజా మరియు ఎన్టీపీసీ కు సంబంధించిన లారీలు ఎక్కువగా ఈ మార్గం గుండా తిరుగుతున్నాయని, కాబట్టి ఆయా యాజమాన్యాలు ఈ రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని సంబంధిత అధికారులను పిలిపించి, ఆర్ అండ్ బి అధికారుల సహకారంతో రోడ్లు మరమ్మత్తులు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

రెండు మూడు రోజుల్లో ఈ మరమ్మత్తు పనులు చేపట్టాలని, తాను అసెంబ్లీలో ఉన్నప్పటికీ కూడా ఈ రోడ్డు మరమ్మత్తులో కు సంబంధించిన ఎస్టిమేషన్లు తయారుచేసి తనకు ఫోన్ చేయాలని అన్నారు. ఈ కాలుష్యంపై ప్రజల నుండి పోరాటం చేసే పరిస్థితి వచ్చిన ఈ పరిస్థితుల్లో యాజమాన్యాలు ముందుకు వచ్చి ఈ పనులు పూర్తి చేయాలని అన్నారు.ప్రభుత్వాలు ఏమి చేసినా అది ప్రజల బాగోగుల కోసమేనని అధిక లోడుతో ప్రయాణం చేసే లారీలు చక్రాలు ఈ గోతుల్లో పడి ఈ బొగ్గు పొడి రోడ్డుపై పడి వ్యాపారాలు మూసుకునే పరిస్థితి ఇక్కడ వర్తకులకు వచ్చిందని అతి తొందరలో ఈ పరిస్థితి నుండి వారిని బయట పడేయాలని ఆయన అన్నారు.

ఈ యొక్క కార్యక్రమంలో ఎన్ టి పి సి హెచ్ ఆర్ డి జి ఎం మహా పాత్ర , హిందూజా కంపెనీ యాజమాన్య సభ్యులు సునీల్, శ్రీనివాసరావు ఫార్మా కంపెనీ యాజమాన్య అసోసియేషన్ ప్రెసిడెంట్ జడ్పీ సుబ్బారావు , జనరల్ సెక్రెటరీ సూర్యప్రకాశరావు, యాజమాన్య సభ్యులు రామకృష్ణ,దొర బాబు, సీనియర్ నాయకులు పంచకర్ల ప్రసాద్ రావు,స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, 85 వార్డ్ కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, వార్డు అధ్యక్షులు పిల్లా శివకృష్ణ, సీనియర్ నాయకులు దుల్లా రామనాయుడు, బోండా అప్పారావు మాస్టర్, మాజీ జడ్పిటిసి సభ్యులు పైలా జగన్నాథ రావు, మాజీ ఎంపీపీ సభ్యులు మాసరపు అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు బొడ్డపు శ్రీనివాస రావు, వియ్యపు చిన్నా,జనసేన పార్టీ నాయకులు సుందరపు శ్రీనివాసరావు, సర్వసిద్ధి సన్యాసి రాజు, బిగిడి రామ గోవింద, వెన్నెల నరసింహారావు, మోటూరు సన్యాసి నాయుడు, దాసరి జయలక్ష్మి ,కాలుష్య పోరాట కమిటీ అధ్యక్షులు కర్రి బుజ్జి , దాసరి తాతారావ, దాసరి రామారావు, కోట్ని శ్రీనివాసరావు, శేఖర్ రెడ్డి, జోగారాజు, మరక త్రినాధ్, నరపిన్ని కిషోర్, లంకెలపాలెం కాలుష్య పోరాట కమిటీ సభ్యులు, వర్తక సంఘం సభ్యులు, ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు, దుర్గాలమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు మరియు పరవాడ మండలం జీవీఎంసీ 79 ,85 వార్డుల ఉమ్మడి ఎన్ డి ఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## స్మార్ట్ కార్డులతో.. స్మార్ట్ ప్రయాణం

జయభేరి, దేవరకద్ర :

స్మార్ట్ కార్డులతో స్మార్ట్ ప్రయాణం రాబోతుందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. మహాలక్ష్మి పథకం లబ్ధిదారులకు త్వరలో స్మార్ట్ కార్డులు రాబోతున్నాయన్నారు. గ్రేటర్ పరిధిలో నకిలీ ఆధార్ కార్డులతో పథకం దుర్వినియోగం అవుతుందన్నారు. రోజుకు 30 వేల మంది ఫేక్ ఆధార్ కార్డులతో ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్నారన్నారు. దీనివల్ల ఆర్టిసి భారీగా ఆదాయాన్ని కోల్పో తుందన్నారు. ఇతర రాష్ట్రాల మహిళలకు అడ్డుకట్ట వేసేలా నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. చిప్ బేస్ టెక్నాలజీ కార్డులను ప్రభుత్వం ప్రవేశ పెట్ట బోతుందన్నారు. కార్డు పై ఫోటో, చిప్ లో పేర్లు, అడ్రస్సు, కేటాయించిన ఐడి ఉంటుందన్నారు. కండక్టర్ టీమ్స్ తో స్పేస్ చేసి టికెట్ జారీ చేసేలా కార్డులను రూపొందించబోతున్నామని ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు.

## నెట్ జీరో స్టేట్ గా తెలంగాణ

■ జీకేఆర్ ఫౌండేషన్ రాష్ట ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ నాయకుడు కోన రాజశేఖర్



జయభేరి, దేవరకద్ర :

తెలంగాణను నేట్ జీరో స్టేట్ గా మార్చడమే రాష్ట కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని జికేఆర్ ఫౌండేషన్ రాష్ట ప్రధాన కార్యదర్శి, దేవరకద్ర నియో జకవర్గం కాంగ్రెస్ నాయకుడు కోన రాజశేఖర్ అన్నారు. గ్రీన్ ఎనర్జీకి రాష్ట్రస్థాయిలో ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వబోతుందన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి గ్రీన్ ఎనర్జీ ఎంతగానో వినియోగ పడుతుందన్నారు. 2034 నాటికి హైదరాబాద్ నెట్ జీరో స్టేట్ గా ప్రభుత్వం మారుస్తుందన్నారు. కాలుష్య నియంత్రణ, రీసైక్లింగ్, సుస్థిర అభివృద్ధిపై ప్రభుత్వం నిరంతర చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ విషయాన్ని ముంబై క్లైమేట్ వీక్ కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పడం జరిగిందని కోన రాజశేఖర్ అన్నారు.

# సర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా కొన్యాల బాల్ రెడ్డి ఏకగ్రీవం

■ కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన బాల్ రెడ్డి

జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 21 :



సిద్దిపేట జిల్లాలో సర్పంచ్ల సంఘం అధ్యక్షుడిగా ములుగు మండలం క్షీరసాగరం గ్రామ సర్పంచ్ కొన్యాల బాల్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే గజ్వేల్ నియోజకవర్గ సర్పంచ్ ఫోరం అధ్యక్షుడిగా దిలాల్పూర్ గ్రామ సర్పంచ్ వెంకట్ రెడ్డి ఎన్నికయ్యారు. గజ్వేల్లో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన అధ్యక్షులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సౌధాని భూమన్న యాదవ్ మాట్లాడుతూ, సర్పంచ్ల సమస్యల పరిష్కారం, నిధులు మరియు విధుల సంరక్షణ కోసం రాజకీయాలకు అతీతంగా సంఘం పనిచేస్తుందని తెలిపారు. 1995 సంవత్సరం నుంచి ఉమ్మడి రాష్ట్రకాలం నుండి నేటి వరకు సంఘం అనేక సమస్యలపై స్పందిస్తూ సర్పంచ్లకు అండగా నిలిచిందని పేర్కొన్నారు. అనంతరం జిల్లా సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు బాల్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు క్రమశిక్షణతో పనిచేస్తూ సర్పంచ్ల సంక్షేమం మరియు సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, గజ్వేల్ మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు అశోక్ రెడ్డి, కౌన్సిలర్లు నరసింహారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, గూగులోత్ రమేష్,నాయిని యాదగిరి, నక్కరాములు గౌడ్, గుంటుకు శ్రీనివాస్, నాయకులు సుఖేందర్ రెడ్డి, నాగరాజు నేత, డప్పు గణేష్ పాల్గొన్నారు.

# గౌడ వర్గం –ముదిరాజ్ వర్గాల మధ్య ఉద్రిక్తత

■ ఈత చెట్లు ధ్వంసం చేసిన ముదిరాజ్ వర్గం నాయకులు
■ పోలీసులు ఇరువర్గాలను సముదాయించే ప్రయత్నం

జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 21 :



వర్గల్ మండలంలోని మసీద్పల్లి గ్రామంలో గౌడ సంఘం, ముదిరాజ్ వర్గాల మధ్య ఈతవనం భూమి వివాదం చెలరేగింది. జీవనోపాధిగా భావిస్తున్న ఈత చెట్లను ముదిరాజ్ వర్గానికి చెందిన కొందరు ట్రాక్టర్తో ధ్వంసం చేశారని గౌడ సంఘం నాయకులు ఆరోపించారు. గతంలో గౌడ సంఘానికి సంబంధించిన స్థలం సొసైటీ లేకపోవడంతో ఎల్లమ్మ గుడి ట్రస్ట్ పేరిట నమోదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. అప్పటి ప్రభుత్వంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా ఈత మొక్కలు నాటినట్లు చెప్పారు. మంజీరా పైప్లైన్ పనుల సందర్భంలో రెండు ఎకరాల భూమిని ప్రభుత్వం ఇవ్వగా, మిగతా ప్రభుత్వ భూమిని ఎల్లమ్మ గుడి పేరిట రిజిస్ట్రేషన్ చేసినట్లు పేర్కొన్నారు. అప్పటి మంత్రి, ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారులు కూడా హాజరై మొక్కలు నాటినట్లు తెలిపారు. ఇటీవల ఆ భూమి తమదేనంటూ ముదిరాజ్ వర్గానికి చెందిన కొందరు అభ్యంతరం వ్యక్తం చేసి ట్రాక్టర్తో కొన్ని ఈత మొక్కలను తొలగించడంతో వివాదం మరింత ముదిరింది. ఇరువర్గాలు రోడ్డుపైకి వచ్చి వాగ్వాదానికి దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని చెట్లు తొలగించిన వారిని గజ్వేల్ ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎక్సైజ్ ఎస్సై తెలిపారు. తొగుట సీఐ లతీఫ్ సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకుని ఇరువర్గాలను సముదాయించే ప్రయత్నం చేశారు. అయితే గౌడ సంఘం సభ్యులు తమ జీవనాధారమైన ఈత చెట్లను ధ్వంసం చేయడం తీరని నష్టమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివరాం గౌడ్, గౌడ సంఘం నాయకులు జయ వెంకటస్వామి, నరేష్ గౌడ్, రవీందర్ గౌడ్, శివరాములు గౌడ్ మాజీ సర్పంచ్, రమేష్ గౌడ్,రంగ గౌడ్,మహేంద్ర గౌడ్, స్వామి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



# యోగా శరీరం మనస్సు ఆత్మలను అనుసంధానించే అద్భుతమైన సాధన

- ఇది కేవలం ఆసనాలు మాత్రమే కాదు..! జీవన విధానం
- కన్హశాంతి యోగ ట్రైనర్ మోహన్
- షాద్ నగర్ లో ప్రతి శని, ఆదివారం సాయంత్రం 5 గంటల నుండి 6 గంటల వరకు యోగా ట్రైనింగ్
- స్థలం పతంజలి యోగ సమితి శిశుమందిర్ స్కూల్ ఆవరణలో..




జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 21 :

యోగ అనేది మానవ శరీరం, మనసును కొత్తవి నుంచి దూరం చేసి మానసిక ఆనందాన్ని ఇచ్చే ఒక అద్భుతమైన శక్తి అని యోగా ట్రైనర్ మోహన్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ పరిధిలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నెంబర్ వన్ యోగా కేంద్రం చేగూరు కన్హశాంతి వనం మనకు అందుబాటులో ఉండడం ఎంతో గర్వకారణం అని ఆయన అన్నారు. ప్రతి శని, ఆదివారం సాయంత్రం 5 గంటల నుండి 6 గంటల వరకు పతంజలి యోగా కేంద్రం శిశుమందిర్ స్కూల్ ఆవరణలో యోగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకుని ఆహ్లాదకరమైన ఆలోచన విధానంతో ఒత్తిడినీ వీడి ఆనందంగా జీవించేందుకు ఒక మంచి మార్గదర్శకమని సూచించారు.



**యోగా వలన ప్రయోజనాలు...**

నిత్యం యోగా సాధన చేయడం వల్ల ఆరోగ్యకరమైన సంతోషకరమైన జీవితాన్ని గడపవచ్చు యోగా ద్వారా భయం, ఆందోళన మరియు ఒంటరితనం నుండి మనల్ని మనం విముక్తం చేసుకోవచ్చు. యోగా రోజువారీ జీవితంలో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే అద్భుతమైన సాధన. ఇది ఒత్తిడి, ఆందోళనలను తగ్గించి, ఏకాగ్రతను పెంచుతుంది. యోగాభ్యాసం హృదయ ఆరోగ్యాన్ని, శరీర వశ్యతను మెరుగుపరుస్తుందని, ముఖ్యంగా ఆధునిక జీవనశైలి వల్ల కలిగే రుగ్మతలను నివారించడంలో సహాయపడుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. యోగా ప్రాచీన భారతదేశంలో ఉద్భవించినా, నేడు ప్రపంచవ్యాప్తంగా శారీరక, మానసిక శ్రేయస్సు కోసం ఒక సమగ్ర వ్యవస్థగా ప్రాచుర్యం పొందింది. ప్రతిరోజూ యోగాభ్యాసం చేయడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని, రక్తపోటు నియంత్రణలో ఉంటుందని, నిద్ర నాణ్యత మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు.

**యోగ వలన కలిగే ప్రయోజనాలను ఆయన క్రింది విధంగా వివరించారు...**

యోగా అనేది తన ద్వారా, తన కోసం, తనని తాను తెలుసుకునే ప్రయాణం. భగవద్గీత.యోగా అనేది వెలుగు, ఒకసారి వెలిగిస్తే అది ఎప్పటికీ తగ్గదు. మీ అభ్యాసం ఎంత మెరుగ్గా ఉంటే, మంట అంత ప్రకాశవంతంగా ఉంటుంది. యోగా మీ శరీరాన్ని, మనస్సును మరియు ఆత్మను అనుసంధానిస్తుంది. యోగా కేవలం ఆసనాల పునరావృతం కాదు, ఇది జీవితంలోని సూక్ష్మ శక్తుల అన్వేషణ.యోగా మిమ్మల్ని ప్రస్తుత క్షణంలోకి తీసుకెళుతుంది, జీవితం ఉన్న ఏకైక ప్రదేశం.యోగా అనేది యవ్వనపు కొలను. మీ వెన్నెముక ఎంత సరళంగా ఉంటే, మీరు అంత యవ్వనంగా ఉంటారు.యోగా అంటే మీ కాలి వేళ్లను తాకడం కాదు, యోగా అంటే మీరు దిగువకు వెళుతున్నప్పుడు నేర్చుకునే విషయాలు. యోగా శారీరక స్థితిని మార్చడమే కాకుండా, చూసే వ్యక్తిని మారుస్తుంది.


# సమాజంలో మీడియా పాత్ర కీలకమైనది

- సమాజంలో జరుగుతున్న సంఘటనలను వెంటనే తెలియజేయడం మీడియా ప్రధాన బాధ్యత
- బిఆర్ఎస్ పార్టీ షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్
- జయభేరి ప్రింట్ మీడియా జర్నలిస్టు బన్నె శ్రీకృష్ణ 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 21 :

ప్రజల సమస్యల కోసం నిరంతరం పనిచేసేది మీడియా రంగమని బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఎక్కడ ఏం జరిగినా వెంటనే సమాచారం ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అందజేసి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రజల సమస్యలు నెరవేరే వరకు ప్రజల పక్షాన ఉండే రంగం మీడియా అని ఆయన అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో అంజయ్య యాదవ్ జయభేరి జర్నలిస్టు బన్నె శ్రీకృష్ణ 2026 దినపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ... మీడియా రంగంలో చురుకైన పాత్రను పోషిస్తూ నిజాన్ని నిర్భయంగా రాస్తూ ప్రజల సమస్యలను నిరంతరం అధికారులకు నాయకులకు లిఖితపూర్వకంగా వ్యక్తపరుస్తూ ప్రజల సమస్యలు నెరవేర్చే వరకు కలాన్ని ఘనంగా ప్రజల పక్షాన వాస్తవాలు రాయాలని ప్రజల సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి చేస్తే ప్రజలకు న్యాయం చేసే విధంగా ప్రజల పక్షాన పోరాడుతామని ఆయన పేర్కొన్నారు.





# నాణ్యమైన వస్తువులు అందించాలి

- వ్యాపారంలో మంచి పేరు ప్రతిష్టలతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలి
- ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ కుమార్ రెడ్డి
- శ్రీ బాలాజీ సిమెంట్ అండ్ స్టీల్ షాప్ ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి

జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 21 :

వినియోగదారులకు నాణ్యమైన వస్తువులతో సేవలందించి వ్యాపారంలో ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి అన్నారు.షాద్ నగర్ పట్టణంలో కేశంపేట రోడ్డులో రాజేష్ కుమార్ నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ బాలాజీ సిమెంట్ అండ్ స్టీల్ షాప్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పాల్గొని షాప్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా నవీన్ రెడ్డి మాట్లాడుతూ.... పరిగెడుతున్న ప్రపంచంలో వినియోగదారులకు నాణ్యమైనతో కూడిన వస్తువులను అందిస్తూ మంచి పేరు ప్రతిష్టలు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు .ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నడికూడ అనిత రఘునాథ్ యాదవ్,మాజీ సర్పంచ్లు ప్రశాంత్ రెడ్డి,యారం శేఖర్ రెడ్డి,రంగయ్య గౌడ్ బీఆర్ఎస్ మధుసూదన్ రెడ్డి, బుచ్చిరెడ్డి,శ్రీశైలం యాదవ్, అంజి, శివ తదితరులు పాల్గొన్నారు.

# మొదటి విడత శిక్షణను పూర్తి చేసుకున్న వార్డు సభ్యులు



జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 21 :

తుర్కపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మొదటి విడత ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు ఐదు రోజులపాటు శిక్షణ పూర్తయిందని ఎంపీడీవో లెంకల గీతారెడ్డి తెలిపారు. శనివారం ట్రైనింగ్ పూర్తయిన వార్డు సభ్యులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి విడత 133 మంది వార్డు సభ్యులకు శిక్షణను ఇచ్చినట్లు తెలిపారు. రెండో విడత ఈనెల 23 నుండి 27 వరకు 132 మంది సభ్యులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్లు జహంగీర్, సంతోష్ కుమార్, మాస్టర్ ట్రైనర్స్ సాయి కుమార్, ఎండి అల్తాఫ్, పవన్ కుమార్, గణేష్, ఉపసర్పంచ్లు, వార్డు సభ్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణా దారులపై చర్యలేవి

- అధికారుల నిర్లక్ష్యం పట్ల పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న ప్రజలు



జయభేరి, దుమ్ముగూడెం :

మండలంలో రేగుబల్లి కాలనీ గ్రామం శివారులో గత వారం రోజులుగా అక్రమ ఇసుక రవాణా యదేచ్ఛగా ఇష్టానుసారంగా రాత్రి పగలు తేడా లేకుండా జరుగుతుంది ఎవరైనా ప్రశ్నిస్తే ఇసుకను దోపిడీ చేస్తున్న అక్రమార్కులు మీరు ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ ప్రజలపై బెదిరింపులకు పాల్పడుతున్నారు మేము రెవిన్యూ అధికారుల వద్ద పరిమిషన్ తీసుకొని ఇసుక రవాణా చేస్తున్నామని చెబుతున్నారు అయినప్పటికీ వారి దగ్గర ఎటువంటి అనుమతి పత్రాలు లేవు అంతేకాకుండా ఈ అక్రమ ఇసుక రవాణాదారులు రవాణా చేస్తున్న ట్రాక్టర్లకు ఎటువంటి నెంబర్లు ఉండడం లేదు ట్రాక్టర్ తోలుతున్న వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్సు లు ఉండడం లేదు ఇష్టం వచ్చిన స్పీడులో సీసీ రోడ్డు సందుల్లో ఈ రవాణా నిర్వహిస్తున్నారు ఇది ఈ విధంగానే కొనసాగితే ఆ రోడ్లో ఎవరికో ఒకరికి ప్రమాదం జరిగే అవకాశం మెండుగా ఉంది రాత్రి పగలు తేడా లేకుండా డెక్కులు ఆన్ చేసి పాటలు పెడుతూ ప్రజలకు రాత్రి నిద్రలేకుండా చేస్తున్నారు ట్రాక్టర్ల రవాణా ధాటికి ప్రజల ఇల్లు దుమ్ము పట్టిపోయి ఆరోగ్యాలు దెబ్బతినే పరిస్థితి నెలకొన్నది రైతుల కల్లాల పేరు చెబుతూ ఇందిరమ్మ ఇళ్ల పేరు చెబుతూ ప్రభుత్వ నిబంధనలు దొంగలు తొక్కుతూ ప్రభుత్వ సంపద అయిన ఇసుకను ఇష్టానుసారంగా అమ్మకాలు జరుపుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇంత జరుగుతున్నప్పటికీ అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు ఈ మౌన వెనక ఏమైనా కారణాలు ఉన్నాయా అంటూ ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ విషయంపై దర్యాప్తు జరిపి అక్రమంగా జరుగుతున్న ఈ ఇసుక రవాణాను నిలుపుదల చేయాలని ఇప్పటివరకు అక్రమంగా తోలిన ఇసుకను రికవరీ చేయాలని తోలకాలు జరిపిన వాహనాలను సీజ్ చేయాలని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజల కోరుకుంటున్నారు.



# మృతురాలు కుటుంబానికి బియ్యం అందజేత

జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 21 :

తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామానికి చెందిన కూతురు బాలమ్మ ఇటీవల మరణించడంతో ఆమె కుటుంబానికి బొత్త ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ బొత్త రాములు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి బాలరాజు, కూతురు లింగం, కుక్కుట్ల ఇస్తారి, కలకుంట్ల సత్యనారాయణ, సాప కిష్టయ్య, ఆలేటి శ్రీశైలం, సాగర్ల బాలరాజ్, శాగ మల్లయ్య, బ్యాగరి అశోక్, కర్ణాకర్, పాల్గొన్నారు.

# దత్తాయపల్లిలో ఎన్ఎస్ఎస్ క్యాంప్



జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 21 :

తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలో భువనగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి డిగ్రీ కళాశాల నుండి ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 ఆధ్వర్యంలో గ్రామంలో ఎన్ ఎస్ ఎస్ క్యాంపు ను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జేరిపోతుల కర్ణాకర్ తో కలిసి గ్రామంలోని మెయిన్ రోడ్డు నుండి గ్రామం చివరి వరకు రోడ్డుకు ఇరువైపుల చెత్తను శుభ్రం చేసి శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కనక బాలరాజు, ఉపసర్పంచ్ బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి బొల్లారం నరసింహ, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు దేవరుప్పల మల్లేశం, దానబోయిన పోచయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.

# ఉచిత మెగా వైద్య శిబిరం



జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 21 :

తుర్కపల్లి మండలం కోనాపురం గ్రామంలో గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ చాడ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో మెడిసిటీ హాస్పటల్ వారి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెడిసిటీ హాస్పిటల్ డాక్టర్లు, పంచాయతీ కార్యదర్శి సందీప్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 21 :

తుర్కపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన కొరిమి నర్సయ్య ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబానికి గ్రామ సర్పంచ్ మన్నెపు రజితతిరుపతి రెడ్డి 10 వేలు రూపాయలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఇలాంటి అవసరం ఉన్న గ్రామ పంచాయతీ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు, పార్టీ నాయకులు రాంమోహన్ రెడ్డి, పండుగ జహంగీ, గుంటిపల్లి శివాజీ, నాగారం కరుణాకర్, రాపోలు వెంకట్ రెడ్డి, మెండు నర్సిరెడ్డి, అన్నం మహిపాల్ రెడ్డి, నాగాయపల్లి కనకయ్య, బత్తుల హరినాథ్, అన్నంపట్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వంతెనకు ఇరువైపులా రోడ్డు పనులు వేగవంతం చేయాలి



జయభేరి, ఘట్కేసర్ :

GHMC ఘట్కేసర్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ వాణి రెడ్డిని ఘట్కేసర్ సర్కిల్ ఐక్య కార్యాచరణ కమిటీ జేఏసీ కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఘట్కేసర్ రైల్వే వంతెన నిర్మాణ పనులు, హెచ్ ఆర్ డిసిఏ వారు నిర్మిస్తున్న రోడ్డు పనుల ఆటంకాలను ఇరువైపుల బాధితులకు నష్టపరిహారం టిడిఆర్ అందజేసే విషయంలో తక్షణమే స్పందించాలని.. వంతెనకు ఇరువైపులా రోడ్డు పనులు వేగవంతం చేయాలని.. డిప్యూటీ కమిషనర్ ని కోరడం జరిగింది. కమిషనర్ సానుకూలంగా స్పందించి టౌన్ ప్లానింగ్ అధికారితో మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు డిప్యూటీ కమిషనర్ కి ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జేఏసీ సభ్యులు బచ్చు నగేష్ కుమార్ గుప్తా, ఎండి సిరాజ్. సలహాదారులు రేసు లక్ష్మారెడ్డి, అల్లు కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.




## ఆధార్ కార్డు కాదు.. ఇకపై ఇది ఉంటేనే మహిళలకు ఫ్రీ బస్సు..!

**జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 21 :**

మహాలక్ష్మీ పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్న మహిళల కోసం ఆర్టీసీ కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. అర్హులకే ప్రయోజనం అందేలా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ కార్డులు జారీ చేయాలని అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఫేక్ ఆధార్ కార్డులతో ప్రయాణాలు, ఇతర రాష్ట్రాల మహిళల వినియోగాన్ని అడ్డుకునేందుకే ఈ చర్యలు చేపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకానికి నగరంలో విశేష స్పందన లభిస్తోంది. ప్రస్తుతం గ్రేటర్ పరిధిలో సుమారు 3,200 బస్సులు నడుస్తుండగా, అందులో దాదాపు 2 వేల ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయి. రోజుకు సుమారు 5 లక్షల మంది ప్రయాణికుల్లో దాదాపు 2 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేస్తున్నారు. ఆక్యుపెన్సీ రేషియో కూడా 90 శాతానికి చేరింది.అయితే, ఇటీవల ఫేక్ ఆధార్ కార్డులతో ప్రయాణాలు జరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. సుమారు 25 నుంచి 30 వేల వరకు అనుమానాస్పద ప్రయాణాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ఆర్థిక భారం పెరుగుతున్న నేపథ్యంలో స్మార్ట్ కార్డు విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. స్మార్ట్ కార్డులను చిప్ ఆధారిత టెక్నాలజీతో రూపొందించనున్నారు. కార్డులో లబ్ధిదారుల పేరు, చిరునామా, ప్రత్యేక ఐడీ నంబర్ వంటి వివరాలు నమోదు చేస్తారు. ప్రస్తుతం ఆధార్ కార్డు చూపిస్తే టికెట్ జారీ చేస్తున్న కండక్టర్లు, కొత్త విధానంలో స్మార్ట్ కార్డును టికెట్ ఇష్యూయింగ్ మెషీన్‌తో స్వైప్ చేస్తారు. వెంటనే టికెట్ జనరేట్ అవుతుంది. దీంతో ప్రయాణ ధృవీకరణ మరింత పారదర్శకంగా ఉంటుంది. ఆధార్ కార్డులను ప్రతిసారి వెంట తీసుకెళ్లాల్సిన ఇబ్బంది తగ్గడంతో పాటు, అర్హులైన మహిళలకు సౌకర్యవంతమైన విధానం అమల్లోకి రానుంది. స్మార్ట్ కార్డు జారీ విధానం, రిజిస్ట్రేషన్ ప్రక్రియపై త్వరలో స్పష్టత ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. మహాలక్ష్మి పథకాన్ని మరింత సమర్థంగా అమలు చేసేందుకు ఈ చర్యలు కీలకంగా మారనున్నాయి.

## ప్రజలకు స్వచ్ఛమైన నీరు, గాలి ఇవ్వాలన్నదే ఉద్దేశం

- వారానికి ఒకసారి మండలానికి, గ్రామానికి స్వచ్ఛ రథం: సిఎం చంద్రబాబు



**జయభేరి, అమరావతి ఫిబ్రవరి 21 :**

వారానికి ఒకసారి మండలానికి, గ్రామానికి స్వచ్ఛ రథం వస్తుందని ఏపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. పాత వస్తువులు ఇస్తే బదులుగా నిత్యావసరాలు ఇస్తారని అన్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు మీకు ఆదాయం వస్తుందని, 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయిందని అన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన నీరు, గాలి ఇవ్వాలన్నదే తమ ఉద్దేశం అని.. అందుకే ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో పాల్గొంటానని అన్నారు. విశాఖలో చెత్త నుంచి కరెంటు తయారు చేస్తున్నారని, మరో ఐదు ప్లాంట్ల ద్వారా కరెంటు తయారు చేస్తామని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రాష్ట్రంలో బ్యాన్ చేశామని చెప్పారు. మార్చి 31 కల్లా వందశాతం ఇంటినుంచి చెత్త సేకరించేలా చేస్తామని, చెత్త ద్వారా మళ్లీ వస్తువుల ఉత్పత్తులు చేస్తామని సిఎం పేర్కొన్నారు. టెక్నాలజీ వినియోగంలో మనమే నెంబర్ వన్ అని..వ్యవసాయంలోనూ ఎఐ సేవలు అందుబాటులోకి తెస్తున్నామని అన్నారు. ఎన్‌డిఎ కూటమి రాష్ట్రంలో పెను మార్పులు తీసుకురాబోతుందని, సూపర్ సిక్స్.. సూపర్ హిట్ చేశామని తెలియజేశారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా చేస్తామని, స్త్రీశక్తి, దీపం పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. పేదల ఆదాయం పెంచేందుకు పి4 పథకం ఉందని, టెక్నాలజీ వినియోగాన్ని మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ మెచ్చుకున్నారని అన్నారు. పల్నాడు అంటే పౌరుషాల గడ్డ అని.. పల్నాడు వస్తే వైబ్రేషన్స్ వస్తాయని, శివరాత్రి అంటే కోటప్పకొండ ప్రభలు ప్రత్యేకం అని కొనియాడారు. ఎఐ సదస్సులో కాంగ్రెస్ తీరు ఆవవేదన కలిగించిందని, కాంగ్రెస్ తీరు దేశానికి మంచిది కాదని సూచించారు. దేశానికి, రాష్ట్రానికి ఎవరు మంచి చేస్తున్నారో ప్రజలు గమనించాలని, దేశానికి ఎంతో మేలు చేసే కార్యక్రమాలకు అండగా నిలవాలని కోరారు. కొందరు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా బూతులు మాట్లాడుతున్నారని విమర్శించారు. అసెంబ్లీలో తన సతీమణిని కూడా అవమానించారని, 23 క్లేమోర్ మైన్స్ ప్రయోగించినా తాను భయపడనని అన్నారు. వెంకటేశ్వరస్వామి స్వయంగా తనను కాపాడారని, వెంకటేశ్వరస్వామిని అపవిత్రం చేస్తే ఊరుకోనని హెచ్చరించారు. మాజీ మంత్రి, దివంగత నేత వైఎస్ వివేకానంద రెడ్డి హత్యను గుండె పోటు అని నమ్మించే ప్రయత్నం చేశారని, నారాసుర రక్త చరిత్ర అంటూ తనపై నెపం నెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. వివేకా హత్య చుట్టూ నాటకాల రాయుడు నాటకాలు ఆడారని, ఇప్పుడు కూడా లడ్డూ కల్తీ చేసి హెరిటేజ్ పేరు తీసుకొస్తున్నారని ధ్వజమెత్తారు. తాను ప్రాణం పోయినా తప్పు చేయనని, లడ్డూ ప్రసాదానికి వాడింది నెయ్యే కాదని సిట్ చెప్పిందని తెలిపారు. తప్పు చేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని, తప్పును పక్కన వాళ్లపై నెట్టే నీచులు కూడా ఉన్నారని, నేరగాళ్లను రాజకీయాలకు దూరంగా ఉంచాలని చంద్రబాబు నాయుడు హితవు పలికారు.

## ఒక గుర్తు తెలియని మహిళ

**జయభేరి, ఎల్బీనగర్ :**

ఒక గుర్తు తెలియని మహిళ (50), తేదీ 20.02.2026 నాడు ఉదయం సుమారు 03.00 గంటలకు తలకు బలమైన గాయంతో పడి ఉండగా, చుట్టూ ప్రక్కల వారు చూసి ఆమెను ఉస్మానియా హాస్పిటల్ కు తరలించగా, మహిళ చికిత్స పొందుతూ తేదీ 21.02.2026 నాడు ఉదయం సుమారు 10.43 గంటలకు మరణించినది. ఆమె ఆచూకీ, వివరాలు గురించి విచారించగా ఈ మహిళ పేరు మేరీ అని ఈమె కల్లు దుఖానాల దగ్గరకు వస్తు ఉండేదని తెలిసినది. పూర్తి వివరాలు ఇంకా తెలియవలసి ఉంది. ఈ మహిళ నీలం రంగు చీర, పచ్చని రంగు గల జాకెట్ ధరించి ఉంది. చామన చాయ రంగు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాము, ఈ మహిళ వివరాలు తెలిసినట్లైతే చైతన్యపురి పోలీసు వారికి తెలియచేవలసిందిగా మనవి.

# శవం మీద బంగారాన్ని కూడా వదలలేదు దుర్మార్గులు..!!

- శవం మీద నుండి బంగారము దొంగలించిన ఇద్దరు నేరస్తులను అరెస్టు చేసిన షాద్ నగర్ పోలీసులు

**జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 21 :**




శవం మీద నుండి బంగారం దొంగలించిన ఇద్దరు నేరస్తులను షాద్ నగర్ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుండి దొంగలించబడిన రెండు తులాల బంగారం చైన్ ను స్వాధీన పరుచుకుని నిందితులను అరెస్టు చేసినట్లు షాద్ నగర్ సిఐ విజయ్ కుమార్ తెలిపారు. పూర్తి వివరాల్లోకి వెళితే తుర్కయాంజల్ కు చెందిన పుల్లగుర్రం పురుషోత్తం రెడ్డి అను వ్యక్తి అతని స్నేహితులతో కలిసి తీర్థయాత్రకు పోయి తిరుగు ప్రయాణంలో బూర్గుల శివారులోని ఎస్ ఎస్ దాబా వద్ద ఇదే నెల 17వ తేదీన రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా అతని మృతదేహాన్ని అతని సోదరుడు విజయానంద్ రెడ్డి ఇంటికి తీసుకెళ్లిన తర్వాత పరిశీలించగా మృతదేహంపై బంగారు చైన్ కనిపించకపోవడంతో అతను షాద్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు స్వీకరించిన అనంతరం పోలీసులు విచారణ ప్రారంభించగా ఈ రోజు ఫిబ్రవరి 21వ తేదీన నమ్మదగిన సమాచారం మేరకు పట్టణ పోలీసులు నిందితులైనటువంటి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాలో లేబర్ గా పనిచేస్తున్న కడియాల కుంట తండాకు చెందిన మూడవత్ లోక్య నాయక్ మరియు డ్రైవర్ గా పనిచేస్తున్న అడ్డాకుల మండలం శాఖాపూర్ గ్రామానికి చెందిన గోదా రవికుమార్ గౌడ్ లను అరెస్టు చేసి విచారించగా ప్రమాదం జరిగిన సమాచారం తెలుసుకొని అక్కడికి వెళ్లి ప్రమాద స్థలం నుండి శవాన్ని తరలించే క్రమంలో శవం మెడలో ఉన్న బంగారం చైన్ తీసుకుని తర్వాత అమ్ముకుని డబ్బులు తీసుకుందామనే ఉద్దేశంలో తమ వద్దే దాచుకున్నామని అంగీకరించినట్లు, నిందితుల వద్ద నుండి రెండు తులాల బంగారు చైన్ ను స్వాధీన పరచుకున్నట్లు పోలీసులు తెలిపారు. షాద్ నగర్ డీసీపీ సిహెచ్ శిరీష మరియు షాద్ నగర్ ఏసీపీ ఎస్ లక్ష్మి నారాయణ పర్యవేక్షణలో, పట్టణ సీఐ విజయ్ కుమార్, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కేసు విచారణాదికారి క్రైమ్ డిటెక్టివ్ సబ్ ఇన్స్పెక్టర్ జి శివ రెడ్డి , క్రైమ్ టీం హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ అయిన రవీందర్, మోహన్, కర్ణాకర్, జాకీర్, రాజు కేసు ను ఛేదించడం లో కీలక పాత్ర వహించినందున వారికి తగిన రివార్డ్ లను పై అధికారుల ద్వారా ఇప్పించడం జరుగుతుందని సిఐ విజయ్ కుమార్ పేర్కొన్నారు.



## అభివృద్ధిని అడ్డుకోవడమే కాంగ్రెస్ లక్ష్యమా?

- గాజుల నిరంజన్, బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు

**జయభేరి, పరకాల, ఫిబ్రవరి 21:**

దేశ అభివృద్ధి కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పటికప్పుడు అడ్డంకులు సృష్టిస్తోందని బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆరోపించారు. ఢిల్లీలో జరుగుతున్న ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ప్రదర్శించిన వైఖరిని ఆయన ఖండించారు. అభివృద్ధిని అడ్డుకోవడమే కాంగ్రెస్ పార్టీ మనస్తత్వమని, అంతర్జాతీయ వేదికల్లో దేశ ప్రతిభను ప్రతిబింబించాల్సిన సమయంలో ఇలాంటి చర్యలు దేశ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నాయని విమర్శించారు. గ్లోబల్ సమ్మిట్‌లు జాతీయ ఏకృతకు వేదికలుగా నిలవాల్సి ఉండగా, కాంగ్రెస్ కార్యకర్తల ప్రవర్తన ఆ లక్ష్యానికి విరుద్ధమని అన్నారు. దేశ ప్రయోజనాలను ముందుంచుకుని అన్ని రాజకీయ పార్టీలు సమన్వయంతో పని చేయాలని, అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని గాజుల నిరంజన్ పిలుపునిచ్చారు.

## శబ్ద కాలుష్యం ద్వారా ప్రజలకు అసౌకర్యం



**జయభేరి, ఎల్బీనగర్ :**

నాగోల్ సమతాపురి కాలనీలోని ఈవెంట్ విల్లా గార్డెన్స్ తేదీ 20.02.2026 రాత్రి సుమారు 23:30 గంటలకు శబ్ద కాలుష్యం ద్వారా ప్రజలకు అసౌకర్యం కలుగుతుందని డయల్ 100 కాల్ రాగా వెంటనే పోలీసు వారు స్పందించి నాగోల్ సమతాపురి కాలనీలోని ఈవెంట్ విల్లా గార్డెన్స్ వద్దకు చేరుకోగ, అట్టి సంబంధిత నిర్వాహకులు పోలీసులు అనుమతుల నిబంధనలను ఉల్లంఘిస్తూ వివాహ వార్షికోత్సవ వేడుక సందర్భంగా డీజే సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసి అధిక శబ్దంతో ప్రజలకు అసౌకర్యం కలిగించినందుకు వారి పైన కేసు నమోదు చేసి డీజే సిస్టమ్, 6 స్పీకర్లు, 1 యాంప్లిఫైర్‌ను స్వాధీనం చేసుకుని చైతన్యపురి పోలీసు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## తుంకుంట లోని డబుల్ బెడ్ రూమ్ కాలని కి బస్సు సౌకర్యం

- ఆనందం వ్యక్తం చేసిన కాలని వాసులు..
- ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపిన కాలని వాసులు

**జయభేరి, శామీర్ పేట్ :**




ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని తూంకుంట డబుల్ బెడ్ రూం కాలనీవాసుల కల నెరవేరింది. ఈ ప్రాంత వాసులకు బస్సు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే బస్సు సౌకర్యం కల్పించాలని జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్ మరియు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్ మరియు ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయించారు.

అనంతరం ఆయన కళానివాసులతో కలసి డబుల్ బెడ్ రూం కాలని నుండి సికింద్రాబాద్ వరకు వెళ్ళే బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా భీమిడి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని గుర్తు చేశారు. విద్యార్థులు, ఉద్యోగులు సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని, అన్ని వర్గాల వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ బస్సు సౌకర్యం కల్పించినట్లు వారు వెల్లడించారు.

ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకుని రవాణా సౌకర్యాలు మెరుగుపర్చేందుకు కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనికి బస్సు సౌకర్యం కల్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్ మరియు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్, జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి మరియు హకింపేట డిపో మేనేజర్ సరిత గారికి కాలని వాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సింగిరెడ్డి మధుసూదన్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బొల్లబోయిన నాగమణి, సింగిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, గట్టు ప్రదీప్ కుమార్, టిఆర్ రవీందర్ గౌడ్, మోత్కుల మల్లేష్ యాదవ్, మహ్మద్ గౌస్ భాష, బాణాల మధుసూదన్ రెడ్డి, కాలని వాసులు నర్సింగరావు, చంద్రశేఖర్, అనిల్ కుమార్, గణేష్ నాయక్, సురేష్, శివ నాయక్, రాము తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేని కలిసిన మున్సిపల్ కౌన్సిలర్లు

- కౌన్సిలర్లను సన్మానించిన ఎమ్మెల్యే
- మున్సిపల్ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని హామీ

**జయభేరి, శామీర్ పేట్:**




ప్రజా సేవలో పాలు పంచుకునే వారిని ప్రజలు మరువబోరని మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. అలియాబాద్ మున్సిపాలిటీకి నూతనంగా ఎన్నికైన మున్సిపల్ కౌన్సిలర్లు బోయిన్ పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్రి రాజశేఖరరెడ్డినీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని పారదర్శకంగా, నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. అదేవిధంగా అలియాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం అలియాబాద్ ప్రాంత అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా పనిచేయాలని సమావేశంలో నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు గుర్క కుమార్ యాదవ్, యమునా శ్యామ్, లాల్ గడి మలక్ పేట్ కౌన్సిలర్ చీదు వనజ శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు వంగ వెంకట్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, రాంరెడ్డి, నరసింహ, శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ యాదవ్, గౌస్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు

**జయభేరి, మేడిపల్లి :**



హిందూ స్వరాజ్య స్థాపకుడు, ధైర్యసాహసాల ప్రతీక అయిన ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను విష్ణు పూరి కాలనీ శివాజీ విగ్రహం వద్ద హనుమాన్ యువ సేన అధ్యక్షులు పవన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు నాయకులు. ఈ సందర్భంగా పవన్ రెడ్డి మాట్లాడుతూ.. శివాజీ మహారాజ్ చూపిన ధైర్యం, స్వాభిమానం, దేశ భక్తి మార్గం ప్రతి భారతీయుడికి ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన ఆలోచనలు, పరిపాలనా విధానం, హిందూ స్వరాజ్య స్థాపనలో చూపిన త్యాగస్ఫూర్తి యువతకు ప్రేరణగా నిలుస్తాయని తెలిపారు. శివాజీ మహారాజ్ ఆశయాల సాధన కోసం మనమందరం సంకల్పంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ జైపాల్ రెడ్డి, రాష్ట్ర నాయకులు గీతారామ్, రాము యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కరుణాకర్ రెడ్డి, పీర్జాదిగూడ మరియు మేడిపల్లి డివిజన్ల బిజెపి అధ్యక్షుడు జమ్మల ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి స్వరూప్ చంద్ర, ఉపాధ్యక్షులు వెంకట రెడ్డి, సుధాకర్ చారి, మల్లారెడ్డి, సెక్రటరీ చంద్రశేఖర్, స్వప్న, నవ్య, తిరుపతి రెడ్డి, మధుసూదన్, BJYM, హనుమాన్ యువసేన నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# రష్యన్ భామల బ్యూటీ సీక్రెట్స్!

**రష్యా పడతులు.. అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తారు. లేత గులాబీ వర్ణంలో.. అందానికి సరికొత్త నిర్వచనంగా మెరిసిపోతుంటారు. తాజాగా, వీరి బ్యూటీ సీక్రెట్స్‌ను వెల్లడించారు బ్యుటీషియన్లు. రష్యా మహిళల మేనిఛాయ రహస్యాన్ని బయటపెట్టారు.**

చర్మాన్ని శుభ్రపరచడానికి రష్యా మహిళలు 'బన్యా స్టీమ్‌బాత్'ను ఎక్కువగా ఆశ్రయిస్తారు. ఈ స్టీమ్‌బాత్ వల్ల చర్మ రంధ్రాలు లోతుగా శుభ్రమవుతాయి. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఈ పురాతన చర్మ సంరక్షణ పద్ధతితో.. మానసికశారీరక విశ్రాంతితోపాటు చర్మానికి మెరుపు, ఆరోగ్యానికి భరోసా దక్కుతుంది. ప్లాస్టిక్, రసాయన ఉత్పత్తులకు పూర్తిదూరంగా ఉంటారు. చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేసేందుకు బిర్చ్/ఓక్ కొమ్మలతో తయారైన స్క్రబ్‌లను ఉపయోగిస్తారు. వీటితో చర్మాన్ని సున్నితంగా మసాజ్ చేయడం వల్ల.. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఎప్పుడూ చల్లగా, పొడిగా ఉండే రష్యాలో.. చర్మం పొడిబారుతూ ఉంటుంది. అందుకే, చర్మాన్ని ఎప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడానికి కొన్నిరకాల సముద్రపు ఉత్పత్తులు, పొద్దుతిరుగుడు, ఆముదం నూనెను వాడుతారు. వీటిలో చర్మ ఆరోగ్యాన్ని రక్షించే పోషకాలు, వృద్ధాప్య నిరోధక లక్షణాలు ఎక్కువ. అవి చర్మం, జుట్టుకు మంచి హైడ్రేషన్ అందిస్తాయి.

కోల్డ్ వాటర్ థెరపీ, ఐస్ ఫేషియల్స్‌తో చర్మాన్ని ఎప్పటికప్పుడు రిఫ్రెష్‌గా ఉంచుకుంటారు. ఈ థెరపీలతో ముఖచర్మం బిగుతుగా మారుతుంది. రక్త ప్రసరణ మెరుగుపడటంతోపాటు ముడతలూ తగ్గుముఖం పడుతాయి.

ఇక కళ్ల కింద వాపును నివారించడంలో కోల్డ్ వాటర్ థెరపీ అద్భుతంగా పనిచేస్తుంది. రష్యన్ల సాంప్రదాయ మాస్క్‌లలో ఎక్కువగా ఉపయోగించే పదార్థాలు.. సోర్ క్రీం, తేనె. వంటింట్లో నిత్యం అందుబాటులో ఉండే ఈ పదార్థాలు.. చర్మాన్ని తేమగా, కాంతివంతంగా ఉంచుతాయి. ఇక క్లెన్సర్లుగా పాల ఉత్పత్తులకు ఓటేస్తారు రష్యన్ అమ్మాయిలు.

ఇందులో ఉండే లాక్టిక్ యాసిడ్.. చర్మాన్ని మృదువుగా, హైడ్రేటెడ్‌గా ఉంచడంలో సాయపడుతుంది. చర్మం పీహెచ్ సమతుల్యతను కాపాడటంతోపాటు చర్మ సహజవర్ణాన్ని మెరుగుపరచడంలోనూ ముందుంటుంది. .ఇలా రసాయన ఉత్పత్తులపై ఎక్కువగా ఆధారపడకుండానే రష్యన్ అమ్మాయిలు అందాన్ని కాపాడుకుంటున్నారు. సంప్రదాయ పద్ధతులను పాటిస్తూ.. 'బ్యూటీ'కి కేరాఫ్‌గా నిలుస్తున్నారు.



# చిన్న పిల్లలకూ నిద్ర ఉండట్లేదు.. మంచిగా పడుకోవాలంటే...

**ఒత్తిడి.. పెద్దల్నే కాదు, పిల్లల్నీ చిత్తు చేస్తున్నది. విద్యాపరమైన టార్గెట్లలో బాల్యం బందీ అవుతున్నది. ఇక డిజిటల్ గ్యాడ్జెట్ల వాడకం.. పిల్లల నిద్రా నాణ్యతను దెబ్బతీస్తున్నది. వాటిల్లోంచి వచ్చే బ్లూలైట్ వల్ల.. నిద్రను నియంత్రించే మెలటోనిన్ సహజ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతున్నది. మొత్తంగా.. నేటితరం చిన్నారులకు కంటినిండా నిద్ర కరువైపోతున్నది. జీవనశైలిలో మార్పుల వల్ల ఈ సమస్య నుంచి బయట పడే అవకాశం ఉన్నది.**

కొంతమంది పిల్లలు.. ఇలా పడుకోగానే అలా నిద్రలోకి జారుకుంటారు. కొందరికి అస్సలు నిద్రపట్టదు. అలాంటి వారిని నిద్రపుచ్చడానికి తల్లిదండ్రులు నానా తంటాలు పడుతుంటారు. జీవనశైలిలో వచ్చిన మార్పులే ఇందుకు కారణంగా కనిపిస్తున్నది. అయితే, చిన్నారుల ఎదుగుదలలో ఆహారం తర్వాత నిద్రే కీలకమైంది. మెదడు వికాసానికీ నిద్ర దోహదం చేస్తుంది. కాబట్టి, పిల్లలకు కంటినిండా నిద్ర ఎంతో అవసరం. ఇందుకోసం పిల్లలకు ప్రత్యేక దినచర్యను అలవాటు చేయాలని చెబుతున్నారు నిపుణులు. కథల పుస్తకాలు చదవడం, చిన్నచిన్న వ్యాయామాలు, మృదువైన సంగీతం వినడం వంటివి పిల్లల మనసును ప్రశాంతపరుస్తాయి.

ఇక స్క్రీన్ టైమ్‌ను తగ్గించడం, పడుకునే ముందు ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లను పక్కన పెట్టేయడం.. నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తాయి. వారాంతాల్లోనూ ఒకే సమయానికి నిద్రలేచే అలవాటు.. నిద్ర చక్రాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది.

ఇక పిల్లల్లో నిద్రను ప్రోత్సహించడానికి.. బెడ్‌రూమ్ చీకటిగా, నిశ్శబ్దంగా, చల్లగా ఉండేలా చూసుకోవాలి. మంచం సౌకర్యవంతంగా ఉండాలి. మనసుకు ప్రశాంతత చేకూర్చే పుస్తకాలు కూడా మంచి నిద్రకు ఆహ్వానం పలుకుతాయి. రాత్రి పడుకునే ముందు శరీరాన్ని సున్నితంగా స్ట్రెచ్ చేయడం, యోగా లాంటివీ.. నిద్రకు సహకరిస్తాయి. అయితే, ఇలాంటి దినచర్యలను పాటించడం కేవలం స్వల్పకాలిక పరిష్కారం కోసమే కాదు. ఇది పిల్లల్లో భావోద్వేగ పరంగా, మానసికంగా సానుకూల మార్పు తీసుకొస్తుంది. స్థిరమైన, ప్రశాంతమైన దినచర్య.. పిల్లలకు స్వీయ నియంత్రణపై నైపుణ్యాన్ని నేర్పుతుంది.

దీర్ఘకాలంలో పిల్లలు ఒత్తిడిని నిర్వహించడానికి సన్నద్ధమవుతారు. మెరుగైన భావోద్వేగాలను కలిగి ఉంటారు. మంచినిద్ర వేసే ఈ పునాది.. పిల్లల తరువాతి జీవితంలో మానసిక ఆరోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుందని పలు సర్వేలూ చెబుతున్నాయి.

### ఎవరెవరికి ఎంతెంత?

ఏడాదిలోపు పసిపిల్లలకు.. రోజుకు 12 నుంచి 16 గంటల నిద్ర అవసరం ఉంటుంది. ఏడాది నుంచి రెండేళ్ల చిన్నారులు 11 నుంచి 14 గంటలు నిద్రపోవాలి. మూడు నుంచి ఐదేళ్లలోపు వారికి .. రోజుకు 10 నుంచి 13 గంటలు నిద్రపోతే ఆరోగ్యం.

పాఠశాలకు వెళ్లే ఆరు నుంచి పన్నెండేళ్ల పిల్లలు రోజుకు 9 నుంచి 12 గంటలు నిద్రపోవాలి. యుక్త వయసులోకి వచ్చిన వారు ప్రతిరోజూ 8 నుంచి 10 గంటల వరకు నిద్రించాలి.

### మంచి నిద్ర రావాలంటే..


పిల్లలు మంచి నిద్రపోయేలా వారి వయసుకు తగ్గట్లుగా కొన్ని అలవాట్లు చేయాలి. పడుకునే మందు పిల్లలు రిలాక్స్ కావాలి. 'బెడ్ రొటీన్స్'ను అలవాటు చేయాలి. చిన్నారుల రాత్రి భోజనాన్ని త్వరగా ముగించాలి. అలాగే, రాత్రిపూట డిన్నర్ లైట్‌గా ఉండేలా చూసుకోవాలి.

రాత్రిపూట నిద్రపోవడానికి మారాం చేసే పిల్లలకు పెరుగన్నం, అరటిపండును తినిపిస్తే.. త్వరగా పడుకునే అవకాశం ఉంటుంది.

పడుకునే ముందు పిల్లలకు గోరువెచ్చని నీటితో స్నానం చేయిస్తే.. త్వరగా నిద్రపోతారు.

ఇంట్లో అందరూ ఒకే సమయానికి నిద్రపోతే.. వారితోపాటు పిల్లలూ నిద్రలోకి జారుకుంటారు.

సాయంత్రంపూట పిల్లలు ఔట్‌డోర్స్ గేమ్స్‌లో పాల్గొనేలా చూడాలి. దీనివల్ల వారి శరీరం అలిసిపోయి.. త్వరగా నిద్రపోవడానికి ఆస్కారం ఉంటుంది.



# మీ జుట్టు వేగంగా.. బలంగా పెరగాలంటే...

**శరీరానికి పూర్తి ప్రొటీన్, విటమిన్లు, ఖనిజాలు, ముఖ్యమైన అమైనో ఆమ్లాలు లభిస్తే, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. వాటి పెరుగుదల కూడా బాగుంటుంది. ఒక నివేదిక ప్రకారం, జుట్టు బలం, మెరుపు, వేగంగా పెరగడానికి సమతుల్య ఆహారం అవసరం. అందువల్ల, మీరు జుట్టు వేగంగా పెరగాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకోవడం ముఖ్యం. ఈ ఆహారాలు తప్పక తినాలని నిపుణులు చెబుతున్నారు.**

**జుట్టు పెరుగుదలకు సూపర్ ఫుడ్స్:** జుట్టు వేగంగా పెరగడానికి పోషకాహారం ప్రత్యేక ప్రాముఖ్యత కలిగి ఉంది. సరైన ఆహారం లేకపోవడం, ఒత్తిడి, మారుతున్న జీవనశైలి కారణంగా జుట్టు రాలడం సమస్య వేగంగా పెరుగుతోంది. పరిశోధన ప్రకారం, మన జుట్టులో 90శాతం ప్రొటీన్ అంటే కెరాటిన్‌తో తయారవుతుంది. శరీరానికి పూర్తి ప్రొటీన్, విటమిన్లు, ఖనిజాలు, ముఖ్యమైన అమైనో ఆమ్లాలు లభిస్తే, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. వాటి పెరుగుదల కూడా బాగుంటుంది. ఒక నివేదిక ప్రకారం, జుట్టు బలం, మెరుపు, వేగంగా పెరగడానికి సమతుల్య ఆహారం అవసరం. అందువల్ల, మీరు జుట్టు వేగంగా పెరగాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకోవడం ముఖ్యం. ఈ ఆహారాలు తప్పక తినాలని నిపుణులు చెబుతున్నారు.

1. **గుడ్డు** – గుడ్లలో ప్రోటీన్, బయోటిన్, జింక్ పుష్కలంగా ఉంటాయి. జుట్టు నిర్మాణానికి ప్రోటీన్ అవసరం. అంటే కెరాటిన్. బయోటిన్ జుట్టును బలపరుస్తుంది. దాని కొత్త పెరుగుదలను వేగవంతం చేస్తుంది. జింక్ నెత్తిమీద చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.
2. **పాలకూర** – పాలకూరలో ఫోలేట్‌తో పాటు ఇనుము, విటమిన్ ఎ, సి ఉంటాయి. శరీరానికి ఆక్సిజన్ సరఫరా చేయడం ద్వారా ఇనుము జుట్టు మూలాలను బలపరుస్తుంది. విటమిన్ ఎ, సి తలపై సహజ నూనె అంటే సెబమ్ ఏర్పడటానికి సహాయపడతాయి. ఇది జుట్టు పొడిబారడాన్ని తగ్గిస్తుంది.
3. **బెర్రీలు** – స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్బెర్రీస్ వంటి బెర్రీలలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఇవి జుట్టు కణాలను ఫ్రీరాడికల్ నష్టం నుండి రక్షిస్తాయి. జుట్టు విచ్ఛిన్నతను నిరోధించే కొల్లాజెన్‌ను నిర్మించడంలో సహాయపడతాయి.
4. **చేపలు** – సాల్మన్, సార్డిన్ వంటి చేపలలో ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ డి, ప్రోటీన్లు లభిస్తాయి.. ఇవి జుట్టు మూలాలను బలోపేతం చేస్తాయి. కొత్త జుట్టు పెరుగుదలను వేగవంతం చేస్తాయి. ఒమేగా3 జుట్టు పొడిగా మారడానికి అనుమతించదు.
5. **వాల్‌నట్స్** – వాల్‌నట్స్ ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ ఇ, బయోటిన్‌లకు చాలా మంచి మూలం. అవి జుట్టు కణాలలో వాపును తగ్గిస్తాయి. బలాన్ని పెంచుతాయి. బయోటిన్ జుట్టు రాలడాన్ని నివారిస్తుంది.
6. **క్యారెట్లు** – క్యారెట్లలో బీటాకెరోటిన్, విటమిన్ ఎ ఉంటాయి. ఇవి తల చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. జుట్టుకు సహజమైన మెరుపును తెస్తాయి. విటమిన్ ఎ జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. జుట్టు విరిగిపోకుండా, రాలకుండా నిరోధిస్తుంది.
7. **విత్తనాలు** – గుమ్మడికాయ, అవిసె, చియా వంటి విత్తనాలలో జింక్, ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ బి పుష్కలంగా ఉంటాయి. అవి జుట్టు ఆకృతిని మెరుగుపరుస్తాయి. కొత్త పెరుగుదలను వేగవంతం చేస్తాయి.
8. **బీన్స్** – బీన్స్ వంటి ఆహారాలు అంటే కిడ్నీ బీన్స్, చిక్‌పీస్, బ్లాక్ ఐడ్ బఠానీలు ప్రోటీన్, ఐరన్, బయోటిన్‌తో సమృద్ధిగా ఉంటాయి. ఇవి శాఖాహారులకు జుట్టుకు ఉత్తమమైన ఆహారాలు.
9. **చిలగడదుంప** – చిలగడదుంపలో బీటాకెరోటిన్ ఉంటుంది. ఇది శరీరంలో విటమిన్ ఎగా మారి జుట్టు పెరుగుదలను వేగవంతం చేస్తుంది. ఇది తల చర్మం సహజ తేమను కూడా నిర్వహిస్తుంది.

(NOTE: ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణులు అందించిన సమాచారం ప్రకారం ఇక్కడ తెలియజేయడమైనది. ఆరోగ్యరీత్యా ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది)





# గేమ్‌మాస్టర్ ఎవరు?

'మీరు నా నుంచి ఏం కోరుకుంటున్నారో.. ఏం మిస్ అవుతున్నారో అనే విషయాలన్నింటిని నేను గమనిస్తున్నా. 'ఫలక్‌నుమా దాస్' తీయకముందు నాలో ఓ కసి ఉండేది. ఈ సినిమాకు ముందు అది పదింతలు పెరిగింది. పిల్లలు, సున్నిత మనస్కులు ఈ సినిమాకు దూరంగా ఉండండి' అన్నారు విశ్వక్‌సేన్. ఆయన కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన మూవీ 'కల్ట్'. తారక్ సినిమాస్ పతాకంపై సందీప్ కాకరాల నిర్మిస్తున్నారు. ఇండియన్ తొలి స్లాషర్ జానర్ (హింస, రక్తపాతంతో కూడిన) మూవీగా వాస్తవ సంఘటనల ప్రేరణతో ఈ చిత్రాన్ని రూపొందించారు. శనివారం టీజర్‌ను లాంచ్ చేశారు. గోవా పబ్‌లో పార్టీ హోస్ట్ మొదలుపెట్టే ఓ ప్రాణాంతకమైన ఆటలో ఓ మిత్రబృందం ఎలా చిక్కుకుంది? ఒక్కొక్కరిని హతమారుస్తూ ముందుకుసాగే ఈ కథలో అసలు గేమ్ మాస్టర్ ఎవరు? అతను రక్షకుడా? ప్రమాదకారుడా? అనే ప్రశ్నలతో టీజర్ ఆసాంతం ఉత్కంఠను పంచింది. ఈ సినిమాలో వందమంది కొత్త నటీనటులున్నారని విశ్వక్‌సేన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర మాటల రచయిత తరుణ్‌భాస్కర్, సంగీత దర్శకుడు రవిబస్రూర్‌తో పాటు చిత్ర ప్రధాన తారాగణమంతా పాల్గొన్నారు. గాయత్రీ భరద్వాజ్, తారక్ పొన్నప, మురళీశర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచన, నిర్మాత, దర్శకత్వం: విశ్వక్‌సేన్.

# లెజెండ్స్ అపూర్వ కలయిక



భారతీయ సినిమా లివింగ్ లెజెండ్స్ కమల్‌హాసన్, రజనీకాంత్ 47 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత కలిసి నటించబోతున్న విషయం తెలిసిందే. ఈ ప్రతిష్టాత్మక సినిమా అప్‌డేట్స్ కోసం యావత్ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. శనివారం ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడింది. రెడ్ జాయింట్ మూవీస్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనుంది. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తారు. ఈ చిత్రానికి 'కెహెచ్ & ఆర్‌కే' అనే వర్కింగ్ టైటిల్‌ను పెట్టారు. 70వ దశకంలో రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి నటించారు. అనంతరకాలంలో వారిద్దరూ భారతీయ సినిమాలో తిరుగులేని స్టార్‌డమ్‌తో లెజెండ్స్‌గా ఎదిగారు. ఈ సందర్భంగా రెడ్ జాయింట్ మూవీస్ ప్రతినిధి మాట్లాడుతూ 'ఇదొక చారిత్రక ఘట్టం. ఇద్దరు దిగ్గజ నటులతో సినిమా చేయటం గొప్ప బాధ్యతగా భావిస్తున్నాం. మా కల నిజమైన అనుభూతి కలుగుతున్నది. భారీ వ్యయంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాం' అన్నారు. ఈ సినిమాకు అనిరుధ్ సంగీతాన్నందిస్తున్నారు.



# తమిళంలో బంపరాఫర్

తెలుగమ్మాయి శ్రీలీల అద్భుతమైన అవకాశాన్ని దక్కించుకుంది. ఇప్పటికే తెలుగులో అగ్ర కథానాయికగా వెలుగొందుతున్న ఈ అందాలభామ.. 'పరాశక్తి' సినిమాతో తమిళచిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఆ సినిమా ఫలితం ఎలాగున్నా.. శ్రీలీలకు తమిళనాట అవకాశాలు మాత్రం బాగానే వరిస్తున్నాయి. తమిళ అగ్ర కథానాయకుడు అజిత్ హీరోగా అధిక్ రవిచంద్రన్ తెరకెక్కించనున్న చిత్రంలో శ్రీలీల కథానాయికగా ఎంపికైందనేది లేటెస్ట్ న్యూస్. ప్రస్తుతం తమిళ మీడియాలో ఈ వార్త బలంగానే వినిపిస్తున్నది. ఇక సినిమా విషయానికొస్తే.. 'AK64' వర్కింగ్ టైటిల్‌తో రూపొందనున్న ఈ చిత్రాన్ని ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై టాలీవుడ్ అగ్ర నిర్మాత అనిల్ సుంకర నిర్మించనున్నారు. అనిరుధ్ సంగీత దర్శకుడు. ఈ సినిమా షూటింగ్ ఈ నెలలోనే మొదలు కానున్నది. ఈ ఏడాది చివర్లో కానీ, సంక్రాంతి కానుకగా గానీ సినిమాను విడుదల చేసే ఆలోచనలో మేకర్స్ ఉన్నారు.



# మిడ్‌వీక్ మోటివేషన్‌తో కేక పెట్టిస్తోన్న స్టార్!

గ్లామర్ ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆ స్టార్ కిడ్, ఇప్పుడు తన ఫిట్‌నెస్ మంత్రంతో నెటిజన్లను ఆశ్చర్యపరుస్తోంది. ఒకప్పుడు అధిక బరువుతో ఇబ్బంది పడి, ఆ తర్వాత తన పట్టుదలతో జీరో సైజ్ నుంచి పర్ఫెక్ట్ ఫిగర్ వరకు ఎదిగిన ఆ నటి ప్రయాణం ఎందరికో స్ఫూర్తిదాయకం. 2026లో తన ఫిట్‌నెస్ లక్ష్యాలను చేరుకోవడంలో ఆమె అస్సలు తగ్గడం లేదు. తాజాగా ఆమె ట్రైనర్ నమ్రతా పురోహిత్ షేర్ చేసిన వీడియోలో 'పైలేట్స్ రీఫార్మర్' పై ఆమె చేస్తున్న విన్యాసాలు చూస్తుంటే మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే. అత్యంత ఫిట్‌గా, టోన్డ్ బాడీతో మెరిసిపోతున్న ఆ స్టార్ హీరోయిన్ మరెవరో కాదు.. సారా అలీ ఖాన్. సాధారణ వర్కవుట్ల కంటే పైలేట్స్ భిన్నంగా ఉంటుంది. ఇందులో వాడే రీఫార్మర్ మెషీన్ శరీరానికి అవసరమైన ప్రతిఘటనను అందిస్తుంది. సారా అలీ ఖాన్ ఈ వర్కవుట్ చేస్తున్న తీరును చూస్తుంటే ఆమె బాడీ ఎంత ఫ్లెక్సిబుల్ గా ఉందో అర్థమవుతుంది. "సారా కంటే మెరుగైన మిడ్‌వీక్ మోటివేషన్ ఇంకొకటి ఉండదు" అంటూ ఆమె ట్రైనర్ ప్రశంసల జల్లు కురిపించారు. రీఫార్మర్ పై చేసే నియంత్రిత కదలికలు శరీరంలోని బిగువును తగ్గిస్తాయి. దీర్ఘకాలంగా ఉన్న కండరాల అసమతుల్యతను సరిచేయడానికి ఇది దోహదపడుతుంది. శరీరాన్ని అలసటకు గురి చేయడం కంటే, శరీరం ఎలా కదలాలి, ఎలా నిలబడాలి అనే అంశాలపై పైలేట్స్ అవగాహన కల్పిస్తుంది. లోపలి నుండి శరీరానికి ఒక బలమైన మద్దతు లభిస్తున్న అనుభూతిని ఇది ఇస్తుంది. సారా అలీ ఖాన్ చేస్తున్న ఈ పైలేట్స్ వర్కవుట్ కేవలం గ్లామర్ కోసం మాత్రమే కాదు, సంపూర్ణ ఆరోగ్యం కోసం అని అర్థమవుతోంది. మీరు కూడా మీ 2026 ఫిట్‌నెస్ గోల్స్ నుంచి పక్కకు తప్పుకోవాలని అనుకుంటుంటే, ఒక్కసారి సారా అలీ ఖాన్ వర్కవుట్ వీడియో చూడండి. ఆ ఉత్సాహం మీకు కూడా వస్తుంది.

# అందుకే మాడలింగ్ వదిలేశా





మాడల్‌గా కెరీర్ మొదలుపెట్టి హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన అస్సాం బ్యూటీ కాయాదు లోహర్. 'డ్రాగన్' సినిమాతో ఒక్కసారిగా సెన్సెషన్ సృష్టించిన కాయాదు.. 'అల్లూరి' సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. వరుస సినిమాలతో బిజీగా మారిపోయిన ఈ ముద్దుగుమ్మ.. తాజాగా విశ్వక్‌సేన్ హీరోగా తెరకెక్కిన 'ఫంకీ'తో మరో హిట్ కొట్టింది. ఈ సందర్భంగా అస్సాం ఆసమ్ బ్యూటీ కాయాదు పంచుకున్న కబుర్లు ఇవి.. మాది అస్సాం. నేను అక్కడే పుట్టాను. మహారాష్ట్రలో పెరిగాను. ఎందుకో తెలియదు చిన్నప్పటి నుంచి సినిమాలంటే ఆసక్తి. ఆ క్రమంలో కొన్నాళ్లు మాడలింగ్ చేశాను. సినిమాల మీదే ఫోకస్ చేయాలని మాడలింగ్ వదిలిపెట్టాను. 'కష్టపడాలి, చిత్తశుద్ధితో ఉండాలి, బాధ్యతగా వ్యవహరించాలి' నాకు తెలిసిన ఫార్ములా ఇదే! ఇండస్ట్రీలో పరిచయాలు లేకపోవడంతో ప్రతి ఆడిషన్‌లో నన్ను నేను నిరూపించుకోవాల్సి వచ్చేది. ఎంత కష్టపడ్డా ఫలితం రాకపోవడంతో డిప్రెషన్‌లోకి వెళ్లిన సందర్భాలూ ఉన్నాయి.

ఫంకీ షూట్ మొత్తం ఫన్నీగా జరిగింది. డైరెక్టర్ అనుదీప్ చలాకీ మనిషి. నవ్వుతూనే యాక్షన్ చెప్పేస్తాడు. షాట్ ఒకే అవ్వగానే మళ్లీ నవ్విస్తాడు. విశ్వక్‌సేన్ కూడా మంచి వ్యక్తి. మొత్తంగా 'ఫంకీ' షూటింగ్ చాలా ఎంజాయ్ చేశా. తెలుగులో ఇది నా రెండో సినిమానే అయినా, భాష పరంగా పెద్దగా ఇబ్బంది అనిపించలేదు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటా. నాకు సంబంధించిన ఫొటోలు పోస్ట్ చేస్తుంటా. వాటివల్ల కొన్నిసార్లు ట్రోల్స్ కూడా ఎదుర్కొన్నాను. సోషల్ మీడియాలో పుట్టుకొచ్చే పుకార్లు, ట్రోల్స్ చూసినప్పుడు ఒక్కోసారి చిరాగ్గా అనిపిస్తుంది. కానీ, ఆ కామెంట్లకు నేను బాధపడటం ఏమిటని ఇగ్నోర్ చేస్తా. గతంలో కొన్ని సినిమాలు చేసినా డ్రాగన్ సినిమాతోనే మంచి గుర్తింపు వచ్చింది. ఆ సినిమా విజయం సాధించడంతో ప్రస్తుతం పది సినిమాలకు సైన్ చేశా. నాని నటిస్తున్న ప్యారడైజ్, సింబు హీరోగా వస్తున్న ఎస్‌టీఆర్ 49 ఈ లిస్టులో ఉన్నాయి. వచ్చిన అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నది నా ఆలోచన. అందుకే ప్రతి కథలో నన్ను నేను ఊహించుకొని చేస్తున్నా. పారడైజ్‌లో కొత్తగా కనిపిస్తా. తెలుగు ప్రేక్షకులు నన్ను ఆదరిస్తారనే నమ్మకంతో ఉన్నా.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**